## నేడు భీమవరంలో ఐద్వా జిల్లా మహాసభ

**హాజరుకానున్న 250 మంది మహిళా నేతలు**

**ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ**

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఐద్వా జిల్లా మహాసభ బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 250 మంది మహిళా నేతలు హాజరుకానున్నారని తెలిపారు. గత మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు, కార్యక్రమాలను సమీక్షించుకుని, భవిష్యత్తు ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. మహిళల స్థితిగతులపై చర్చించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మహాసభలో నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

# ఉచిత బస్సు.. కార్మికుల పస్తు..!

- స్త్రీ శక్తి అమలుతో ఆటో కార్మికుల ఆవేదన
- కిరాయిలు లేక స్టాండ్ల నుంచి కదలని ఆటోలు
- వాహన మిత్ర, వెల్ఫేర్ బోర్డు ఎప్పడంటూ నిర్వేదం

ప్రజాశక్తి - భీమవరం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో కార్మికుల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒకవైపు కిరాయిలు లేక ఆటోలు స్టాండ్ల నుంచి కదలని పరిస్థితి. మరోవైపు అప్పు చేసి కొనుగోలు చేసిన ఆటోలకు ఇఎంఐలు, ఆర్టీఓ పన్నులు చెల్లించలేక ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికుల పరిస్థితి కరోనా పరిస్థితులను తలపించేలా ఉన్నాయనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీనివల్ల స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కరోనా అనంతరం ఆర్థికంగా దెబ్బతిన్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు నేటికీ కోలుకోలేదు. జిల్లాలో సుమారు 16 వేల ఆటో డ్రైవర్ కుటుంబాలు ఉన్నాయి. పరోక్షంగా మరో 5 వేల మంది కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి ఉన్నారు. ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా తమ సొంత పెట్టుబడితో ఒకవైపు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించుకుంటూ, మరోవైపు ప్రభుత్వానికి రవాణా పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాల్లో బహుళజాతి సంస్థలైన ర్యాపిడో, ఉబర్, ఓలా కంపెనీలకు అనుమతులిచ్చింది. దీని వల్ల ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక నానావస్థలు పడుతున్నారు. దీనికితోడు వ్యక్తిగత వాహనాలపై ప్రజారవాణా నిర్వహించకూడదని కర్ణాటక హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం బహుళజాతి సంస్థలకు అనుమతులను ఇవ్వడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని, ఆటో డ్రైవర్లపై అధిక చలానాలు విధించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.21 రద్దు చేస్తామని చెప్పినా ఏకపక్షంగా అమలు కాలేదు.

**వాహన మిత్ర ఊసే లేదు.. వెల్ఫేర్ బోర్డు ఊసేలేదు**

గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన వాహన మిత్ర పథకం కింద సాయం రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంచి ఇస్తామని హామీ ఇచ్చినా కూటమి ఏడాదైనా ప్రభుత్వ హామీ నెరవేరలేదు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో, రవాణా రంగ కార్మికులు అందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీపైనా ప్రభుత్వం ఇంతవరకు నోరు మెదపడం లేదు. వివిధ రూపాల్లో కోట్లాది రూపాయలు ప్రభుత్వం రవాణా రంగం నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్నప్పటికీ రవాణా రంగ కార్మికులకు ఇంతవరకు సంక్షేమ చట్టాన్ని రూపొందించలేదు. ఆటో డ్రైవర్లకు మేలు చేయకపోగా ఉచిత బస్సు ప్రయాణం అమలు వల్ల ఆటో డ్రైవర్ల కిరాయిలు తగ్గుముఖం పట్టాయి. ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేసే ముందు ఆటో డ్రైవర్ల సంఘాలతో కనీసం చర్చించకుండా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అదే సమయంలో ఆటో డ్రైవర్లకు జరిగే నష్టాన్ని పూడ్చేలా ప్రభుత్వం ఆదుకోవాలని అంతా కోరుతున్నారు. లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కూ సంవత్సరానికి రూ.25 వేల చొప్పున సహాయం అందించాలని ఏపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేస్తోంది.

### ఆదాయ మార్గం చూపించాలి

**లక్కోజు సతీష్, ఆటో యూనియన్ నాయకులు, గునుపూడి**

ఉచిత బస్సుపై చాలా ఆందోళన చెందుతున్నాం. ఆటోలు ఎక్కేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. కిరాయిలు లేక, ఆదాయం లేక కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. మాకు ప్రత్యామ్నాయ ఉపాధి లేదా మరేదైనా ఆదాయ మార్గం చూపించాలి. లేకపోతే నాలాంటి ఆటో కార్మిక కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది.

### ఏకపక్షంగా ఉచిత బస్సు అమలు దారుణం

**గిరడ శ్రీను, ఆటో యూనియన్ నాయకులు, భీమవరం**

ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు తప్పవు. అప్పులు ఫైనాన్స్ కట్టలేక, కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల కష్టాల గురించి ఆలోచించి మాకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలి. ఏకపక్షంగా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడం దారుణం.

### ప్రత్యామ్నాయం చూపాలి

**ఇంటి సత్యనారాయణ, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు**

ఉచిత బస్సుకు మేం వ్యతిరేకం కాదు. ఆటో కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని యూనియన్లతో చర్చించాలి. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. ఆటో కార్మికులను ఆదుకునేలా ప్రకటన చేయాలి. ప్రతినెలా ఆటో కార్మికులకు భృతి ఇవ్వాలి. చాలామంది అప్పులు చేసి ఆటోలు కొన్నారు. వారందరినీ ఆదుకోవాలి.

### మాకు న్యాయం చేయాలి

**జి.హానోక్, ఆటో యూనియన్ నాయకులు, కుముదవల్లి**

ఇప్పటికే ఆటోలు పెరిగి డ్రైవర్లకు ఉపాధి అంతంతమాత్రంగా ఉంది. ఉచిత బస్సుతో పూర్తిగా ఉపాధి కోల్పోయి ఆటోలను ఫైనాన్స్ కంపెనీలకు అప్పగించాల్సి వస్తోంది. డ్రైవర్లంతా ఆటోలు వదిలి ఇతర పనులకు వెళ్లే పరిస్థితి వచ్చింది. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి.

### మహిళా ప్రయాణికులే ఎక్కువ

**వంపన గోపీ, భీమవరం టౌన్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు**

ఆటోల్లో 30 శాతం మహిళలే ప్రయాణిస్తారు. వారి ద్వారానే మేం ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు ఉచిత బస్సుతో ఆటోలు ఎక్కేవారు తగ్గిపోయారు. మా పరిస్థితి ఏంటి. కూలి పనులకు, ఆస్పత్రులకు వెళ్లే మహిళలను తీసుకెళ్తూ ఉపాధి పొందుతున్నాం. ఉచిత బస్సుతో అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం.

### ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

**ఐవి.సురేష్‌స్వామి, ఆటో యూనియన్ నాయకులు, పాలకోడేరు**

ఇప్పటికే వ్యాపారాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎలక్ట్రిక్ బైకులు, ఓలా, ర్యాపిడో వంటి వాటి వల్ల తీవ్రంగా నష్టపోయాం. మహిళలకు ఉచిత బస్సు పెట్టడంతో మా ఉపాధి పూర్తిగా కుదేలైంది. ఏం చేయాలో దిక్కుతోచక ఉన్నాం. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

# కలెక్టరేట్ భవన నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి

**ప్రజాప్రతినిధులను, రాజకీయ పక్షాలను సంప్రదించాలి**

**పి-4 పేరుతో కలెక్టరేట్ భవన నిర్మాణం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టొద్దు**

**అందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులోనే నిర్మించాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, ప్రజాప్రతినిధులను, రాజకీయ పక్షాలను కలుపుకుని ప్రజామోదంతో కలెక్టరేట్ నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కలెక్టరేట్ భవనాన్ని ఎక్కడ నిర్మిస్తారో తక్షణం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ముఖ్యమంత్రిని కలిసి పి-4 పద్ధతిలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ శంకుస్థాపనకు రావాలని కోరినట్లు ప్రచారం సాగుతోందన్నారు. జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, శాసన మండలి ఛైర్మన్, ప్రభుత్వ విప్‌లు, పిఎసి ఛైర్మన్, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు అభిప్రాయం ఏమిటో నేటికీ ప్రజలకు తెలియకపోవడం, సిఎంను కలిసిన వారిలో వారెవ్వరూ లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పి-4 పద్ధతిలో కలెక్టరేట్ భవన నిర్మాణం అంటే ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడమేనని విమర్శించారు. ఎవరి స్వలాభం కోసం పి-4 పద్ధతిన తలపెడుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయ భవనాలు కూడా నిర్మించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. జిల్లాలోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నేతలు తమ అభిప్రాయాలను ప్రకటించాలని గోపాలన్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అందరి ఆమోదంతో ప్రకటించిన భీమవరం మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ నిర్మిస్తారా, లేదా అనేది కూడా స్పష్టం చేయాలన్నారు. గతంలో నూతన కలెక్టరేట్ ప్రాంగణ స్థలాన్ని ప్రకటించి జిఒ విడుదల చేసినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఆమోదించారని గుర్తు చేశారు. తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఆచంట, ఇలా జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు సౌలభ్యంగా మార్కెట్ యార్డు ఉందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం కలెక్టరేట్ భవన నిర్మాణంపై ప్రకటించాక సిపిఎం వైఖరి చెబుతామని తెలిపారు. ప్రజామోదం లేకుండా ముందుకెళ్తే ఉద్యమిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపాలన్

## 7, 8 తేదీల్లో కౌలురైతుల సంఘం జిల్లా మహాసభ

**జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరణ**

ప్రజాశక్తి - పాలకొల్లు

నిరంతరం రైతులు, కౌలురైతుల సమస్యలపై పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా నాలుగో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూసంపూడి సుబ్బరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సమతా భవనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ సంఘం జిల్లా మహాభ సెప్టెంబర్ 7, 8 తేదీల్లో పోడూరు మండలం కవిటంలోని పరశురామరెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, పంటకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, ప్రభుత్వం ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని, ధాన్యం డబ్బు వెంటనే ఇవ్వాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులిచ్చి ప్రభుత్వ రాయితీలన్నీ అందించాలని సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా మహాసభ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో నేతలు కవురు శ్రీనివాస్, పల్లి జార్జిబాబు, ఉందుర్తి శ్రీను, బొర్రా ధర్మారావు, కేతా వెంకట సుబ్రహ్మణ్యం, గూడూరి ఆంజనేయులు, కొడెల్ల మందులయ్య పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరించిన నేతలు

## 25న ఒపిఎస్ అమలు కోరుతూ మహాధర్నా

ప్రజాశక్తి - తణుకు

పాత పెన్షన్ విధానం అమలు కోరుతూ ఈ నెల 25న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి డియస్‌సి-2003 ఉపాధ్యాయుల ఫోరం, యుటిఎఫ్, పిఆర్‌టియు, ఎస్‌టియు జిల్లా నాయకులు కోరారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం డిఎస్‌సి-2003 ఉపాధ్యాయ, ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని 16 రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తుంటే, మన రాష్ట్రంలో మెమో 57ను అమలు చేస్తామంటూనే, అమలు చేయక కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సి-2003 కన్వీనర్ ఎంసిహెచ్.వెంకట్రావు, ఎన్‌విటి.సత్యనారాయణ, ఎన్‌ఆర్.అప్పారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్.వెంకటరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

# కన్ఫర్డ్ ఐఎఎస్‌గా డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

**ప్రకటించిన ప్రభుత్వం**

**అభినందించిన కలెక్టర్, జెసి**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా రెవెన్యూ శాఖాధికారిగా పని చేస్తున్న మొగిలి వెంకటేశ్వర్లును కన్ఫర్డ్ ఐఎఎస్‌గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలను అందజేసి వెంకటేశ్వర్లను అభినందించారు. ఐఎఎస్ 2023 సెలక్షన్ లిస్ట్‌కు చేపట్టిన ప్రమోషన్ జాబితాలో ఈ నియామకం జరిగింది. మొగిలి వెంకటేశ్వర్లు స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లా పెట్లూరివారిపాలెం. ఆయన 1976 మే 20న జన్మించారు. 1996 అక్టోబర్ 17న వ్యవసాయ శాఖలో సబార్డినేట్ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరారు. 2002లో ఎపిపిఎస్‌సి గ్రూప్-2కు ఎంపికై ఎపి సెక్రటేరియట్లో టిసిఎగా నియమితులయ్యారు. అనంతరం 2004లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా, 2008 నుండి 2011 వరకు ఇంధన శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతిపై పని చేశారు. 2011లో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది, 2014 నుండి 2019 వరకు ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో డిప్యూటీ సెక్రటరీగా పని చేశారు. అనంతరం 2019లో తాడేపల్లిలోని ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీలో జాయింట్ సెక్రటరీగా పని చేశారు. 2019 జులై నుండి 2020 మార్చి వరకు నరసరావుపేట ఆర్‌డిఒగా, 2020 ఏప్రిల్ నుండి 2023 సెప్టెంబర్ వరకు, 2023 అక్టోబర్ నుండి 2024 ఫిబ్రవరి వరకు, 2024 ఫిబ్రవరి నుండి 2024 అక్టోబర్ వరకు కృష్ణా, ఏలూరు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో డిఆర్‌ఒగా పని చేశారు. అనంతరం 2024 అక్టోబర్ నుండి పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా ఇక్కడికి వచ్చారు. డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లును కన్ఫర్డ్ ఐఎఎస్‌గా ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



వెంకటేశ్వర్లును అభినందిస్తున్న కలెక్టర్, జెసి

## 23న మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

**బ్రోచర్, విగ్రహ ప్రతిమలను ఆవిష్కరించిన ఎంఎల్‌ఎ అంజిబాబు**

**భీమవరం టౌన్** : ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎంఎల్‌ఎ అంజిబాబు నివాసంలో ఈనెల 23వ తేదీన భగవాన్ ప్లాజా వద్ద జైత్ర బిజ్ సొల్యూషన్స్(భీమవరం డాట్ కామ్) అధ్వర్యంలో 5 వేల ఉచిత వినాయక ప్రతిమల పంపిణీ బ్రోచర్ విగ్రహ ప్రతిమను ఎంఎల్‌ఎ అంజిబాబు ఆవిష్కరించారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో 13 ఏళ్లుగా ఉచిత వినాయక ప్రతిమలను అందించడం అభినందనీయమని అన్నారు. ఈనెల 27న జరిగే వినాయక చవితి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగంతో పర్యావరణానికి పెను నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజలు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, యర్రంశెట్టి శివకృష్ణ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

## రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి

**విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్**

**మొగల్తూరు** : రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ నూతన త్రిసభ్య కమిటీకి సూచించారు. మండలంలోని కేపీ పాలెం సౌత్ పంచాయతీ వడ్లవానిపాలెంలో ఉన్న సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్‌గా వలవల శేషారావు(బాబులు), కమిటీ సభ్యులుగా కొయ్య కృష్ణ, కొండేటి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ ద్వారా రుణాలు ఇవ్వడంతో పాటు ధాన్యం కొనుగోలు కూడా జరుగుతుందన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు అందే వెంకటలక్ష్మి దొరబాబు, కడలి సోంబాబు, కునపు రెడ్డి గోవిందరాజు, సత్తినేని శ్రీనివాస్, తాతాజీ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న శేషారావు

## నీట మునిగిన కనకాయలంక కాజ్ వే

**పడవల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు**

ప్రజాశక్తి - యలమంచిలి

వశిష్ట గోదావరి నదికి వరద నీటిమట్టం పెరిగిన నేపథ్యంలో మంగళవారం మండలంలోని కనకాయలంక కాజ్ వే వరద నీటిలో చిక్కుకుంది. దీంతో కనకాయలంక నుండి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైపునున్న చాకలి పాలెం, రాజోలు జగ్గన్నపేట, తదితర గ్రామాలలో విద్యను అభ్యసించే కనకాయలంక గ్రామ విద్యార్థులు, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు రెండు మర పడవలను అధికారులు ఏర్పాటు చేయడంతో లంక గ్రామ ప్రజలు పడవలలో ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. అక్కడి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తహాశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పోలీసులను అలర్ట్ చేశారు.

పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్న కనకాయలంక కాజ్ వే

# పాలకోడేరులో రియల్టర్ల దందా

**పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్ల ఏర్పాటు**

**అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు**

**డిప్యూటీ స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన లేఅవుట్ పంచాయతీ**

**పాలకోడేరు లేఅవుట్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు**

పాలకోడేరులో అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్

ప్రజాశక్తి - భీమవరం

ఎవరైతే మాకేంటి.. అంతా మా ఇష్టం.. అనుమతులతో మాకు పనిలేదు.. నిర్మాణాలు చేపడతాం.. అడ్డుకోవడానికి ఎవరు వస్తారో చూస్తామంటూ పాలకోడేరులో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. పుట్టగొడుగుల్లా అక్రమ లేవుట్లు ఏర్పాటుచేసి ఎటువంటి అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం భూమిని కూడా ఇవ్వకుండా అక్రమ లేఅవుట్‌లో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. అధికారులు నోటీసులు ఇచ్చిన లేఅవుట్లో హెచ్చరిక బోర్డులు పెట్టినా, చివరకు ఆయికట్టు రైతులు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా రియాల్టర్లు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయానికి సమీపంలో సుమారు మూడున్నర ఎకరాల్లో అక్రమ లేఅవుట్ ఏర్పాటు చేశారు. దీనికి ఎటువంటి అనుమతులు లేవు. లేఅవుట్‌కు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో సమీపంలోని పంట బోదినే సగానికిపైనే పూడ్చివేసి రక్షణ కూడా నిర్మించడం జరిగింది. దీనిపై నుంచి లేఅవుట్‌కు వెళ్లేందుకు రహదారి మార్గాన్ని చూపించారు. అలాగే డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్తు కూడా ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. దీనిపై పాలకోడేరు గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేష్ వర్మ పిజిఆర్‌ఎస్ లో ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్, పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి అక్రమ లేఅవుట్‌లో జరుగుతున్న పనులను నిలుపుదల చేశారు. అయితే తర్వాత రోజు మళ్లీ పనులు ప్రారంభించడంతో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు కార్యాలయం దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగింది. ఈ నేపథ్యంలో తక్షణం లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అయినా పనులు నిలుపుదల చేయకపోవడంతో సంబంధిత లేఅవుట్ యజమాని పై పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్ యజమానిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు.

**హెచ్చరిక బోర్డులు తొలగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు..**

గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన 10 నాన్ లేఅవుట్‌లో పంచాయతీ కార్యదర్శి బంగారు గోపీ ఈ ఏడాది ఫిబ్రవరి 15 వ తేదీన 10 హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమించి అక్రమంగా లేఅవుట్లు వేసినా, నాన్ లేఅవుట్లు ఏర్పాటు చేసిన, హెచ్చరిక బోర్డులు తొలగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అప్పట్లో హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే వారం రోజులు గడవకముందే ఫిబ్రవరి 23వ తేదీన అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు రియాల్టర్లు నిర్థాక్షన్యంగా తొలగించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంచాయతీ అధికారులను తమ లేఅవుట్లో బోర్డులు ఎందుకు ఏర్పాటు చేశారంటూ కార్యదర్శిపై చిరుబురులాడుతూ రెచ్చిపోయారు. దీనిపై అనాధికార లేఅవుట్లు ఏర్పాటుచేసిన, బోర్డులు తొలగించిన వారిపై పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి అప్పట్లో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారు. అయితే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. మరోసారి రియల్ ఎస్టేట్ వ్యాపారిపై ఫిర్యాదు చేయడంతో ఈసారైనా కేసు నమోదు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

## భీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలి

**సిఐటియు 14వ మహాసభ డిమాండ్**

**ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు కాపాడుకోవాలి : సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్**

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలని సిఐటియు భీమవరం పట్టణ 14వ మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు పట్టణ 14వ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సిహెచ్.మహాలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పి.రాజేశ్వరి, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, సివిల్ సప్లై గోడౌన్ నాయకులు ఉదయభాస్కర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు రాజు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడారు. నూతన పరిశ్రమలు నిర్మించి కార్మిక వర్గానికి ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు మూసివేసి మోడీ ప్రభుత్వం నిరుద్యోగం పెంచుతుందన్నారు. ప్రభుత్వ భూములు కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే విధానం విడనడాలన్నారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. సిఐటియు భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు గత మూడేళ్ల కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టి చర్చించారు. దీనిపై వివిధ రంగాల సభ్యులు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని 20 మందితో ఎన్నుకున్నారు. సిఐటియు భీమవరం పట్టణ కన్వీనర్‌గా దేగల నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా జె.సూర్యచంద్ర రాజు, కమిటీ సభ్యులుగా సిహెచ్.మహాలక్ష్మి, పి.రాజేశ్వరి, నీలాపు రాజు, కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరావు, బి.చిన్న సామంతుల ఉదయభాస్కర్, మాధవి, కృష్ణవేణి, రమాదేవి, బంగారు వరలక్ష్మి ఎన్నికయ్యారు.

## గుడ్డ సంచుల పంపిణీ

**వీరవాసరం :** పర్యావరణానికి హాని కలిగించే ప్రతి వస్తువును విస్మరించాలని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. కొల్లా భాస్కరమ్మ, శ్రీవీర రాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. అనంతరం స్థానిక మహిళలకు గుడ్డ సంచులు ఎంఎల్ఎ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందజేయాలని అక్కడి మహిళలు ఎంఎల్ఎను కోరారు. వారం రోజులలో కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందని ఎంఎల్ఎ వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గ భవానీ చంద్రశేఖర్, తహశీల్దార్ ఎపి.రామాంజనేయులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు, పి.రాంబాబు పాల్గొన్నారు.

## బంగారు హారం బహూకరణ


బంగారు హారం బహుకరిస్తున్న దాతలు

**కాళ్ల :** కాళ్లకూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానానికి భీమవరంకు చెందిన దాత బంగారు హారం మంగళవారం బహూకరించారు. భీమవరంకు చెందిన కరారి శ్రీనివాసరాజు, సూర్యకుమారి దంపతులు 71 గ్రాములతో సుమారు రూ.6 లక్షల 80 వేల విలువ గల 2 పేటల లక్ష్మీదేవి లాకెట్(బంగారు హారం) దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించి వారికి స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయం, హైస్కూల్ సందర్శన

**నరసాపురం :** యర్రంశెట్టివారి పాలెం గ్రామ సచివాలయాన్ని, జెడ్‌పి హై స్కూల్‌ని మంగళవారం డిఎల్‌డిఒ(డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్) జి.రాణి సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్ ఫ్రమ్ హోం-స్వామిత్వ సర్వేపై సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఆమె మాట్లాడుతూ వర్క్ ఫ్రమ్ హోం కార్యక్రమం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఒక మంచి పథకమని పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే ద్వారా ప్రతి ఇంటి యజమానికి సరైన డాక్యుమెంటు అందజేయబడుతుందని వివరించారు. తరువాత జిల్లా పరిషత్ హై స్కూల్‌ను పరిశీలించిన ఆమె దానిని మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయడానికి అంగీకరించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన ఏర్పాట్లను కూడా పరిశీలించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, స్కూల్ హెడ్‌మాస్టర్ కొలపర్తి శ్రీనివాస్, సచివాలయం సెక్రెటరీ జి.రాజు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఐరన్ బీరువా వితరణ

ఐరన్ బీరువాను బహుకరిస్తున్న హమీమా

**ఉండి :** ఉండి గోరింతోట మండల పరిషత్ ప్రత్యేక పాఠశాలకు బెజవాడ రైల్వే డివిజన్‌లో సీనియర్ లోకో పైలెట్‌గా పనిచేస్తున్న మత్తె హమీమా ఐరన్ బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.కాంతమ్మ మాట్లాడుతూ హమీమా స్థానికురాలు కావడంతో పాఠశాలలో ముఖ్యమైన రికార్డులు భద్రపరిచేందుకు ఐరన్ బీరువా అవసరమని గుర్తించి తన సొంత డబ్బులతో పాఠశాలకు అవసరమైన సామాగ్రి బహూకరించడం అభినందనీయమని అన్నారు. హమీమ స్ఫూర్తితో మరింతమంది పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హమీమ కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

## డాక్టర్ రాజరాజేశ్వరికి జాతీయ ఐక్యతా అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజరాజేశ్వరి

**పాలకొల్లు :** స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ నుండి నేషనల్ యూనిటీ అవార్డ్(జాతీయ ఐక్యతా అవార్డ్) 2025ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాలలో మంగళవారం ఈ అవార్డ్ అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాశ్వరికి అవార్డ్ రావటం పట్ల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎం కార్యక్రమాల సమన్వయకర్తగా పాందువ్వ శ్రీను

**ఉండి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల సమన్వయకర్తగా మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన మాజీ ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణ రాజు(పాందువ్వ శ్రీను)ను నియమిస్తున్నట్లు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ఆయన స్వగ్రామంలో అభిమానులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## ప్రత్యేక వ్యాక్సినేషన్‌కు సహకరించాలి

**పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో వ్యాక్సిన్ వేయించుకోని వారికి అన్ని స్కూల్స్, కాలేజీలలో 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నవ్యజీవన్ తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు వ్యాక్సిన్ ప్రాముఖ్యత తెలియజేశారు.

## ముగ్గురు నిందితుల అరెస్ట్

**తాడేపల్లిగూడెం:** దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి మూడు లక్షల పదిహేను వేల రూపాయలు విలువగల బంగారు వస్తువులను స్వాధీన పరుచుకున్నట్లు పట్టణ సిఐ ఆది ప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టణ సిఐ ఆది ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన ఏలూరు రోడ్ లో బస్ స్టాప్ వద్ద బంధ కవి మేధా వెంకట సుబ్రహ్మణ్యం శర్మ బస్సు కోసం వేసి ఉండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కార్‌లో డ్రాప్ చేస్తామని నమ్మించి కొంతదూరం తీసుకెళ్లిన తర్వాత వాహనం ఆపి అతనిపై దాడి చేసి రూ.3,500 నగదు, రూ.3,11,500 విలువ చేసే బంగారు వస్తువులను అపహరించినట్లు ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ పర్యవేక్షణలో పట్టణ సిఐ బోనం ఆది ప్రసాద్, ఎస్‌ఐలు నాగరాజు, బాదం శ్రీను, సిబ్బందితో కలిసి ఈనెల 18 సోమవారం సాయంత్రం 6 గంటలకు ముగ్గురు నిందితులను తాడేపల్లిగూడెం రైల్వే ట్రాక్ పక్కన వాసవి కాలేజ్ ఆవరణ సమీపంలో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి దొంగలించబడిన 3 లక్షల 15 వేల రూపాయలు విలువ గల బంగారు వస్తువులను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసు దర్యాప్తు రికవరీలు ప్రతిభచాటిన పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆది ప్రసాద్, ఎస్‌ఐలు నాగరాజు, బాదం శ్రీను, సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పి అభినందించారు.

## చీటీ కట్టి మోసపోయిన బాధితులు

### న్యాయం చేయాలని వేడుకోలు

**కాళ్ల :** ఏలూరుపాడు గ్రామంలో ఒక చీటి సొమ్ము నిర్వాహకురాలి ఆగడాల నుంచి కాపాడాలని బాధితులు ఈనెల 14న భీమవరం డిఎస్‌పికి తమ బాధను విన్నవించడంతో ఈనెల 16న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో చిట్టి సొమ్ము నిర్వాహకురాలి సుధాబత్తుల లక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఏలూరుపాడు గ్రామం గరువులో పేద కుటుంబాలు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పేద కుటుంబాల నుంచి అనధికార చీటీల వ్యాపారం చేస్తూ, అధిక డబ్బులు ఆస చూపుతూ తీరా చీటీలు వేసాక లెక్కల్లో గోల్ మాల్ చేస్తూ, లక్షల్లో అప్పులు నెట్టడం జరుగుతుంది. మొత్తం కట్టకపోతే మీ పిల్లల్ని చంపుతా అంటూ బాధితులను బండ బూతులు తిడుతూ, కొడుతూ బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటనలు జరిగాయి. ఏలూరుపాడు గ్రామ సర్పంచి భూపతి రాజు వెంకట జగ్గరాజు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మచిలీపట్నంలోని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా నేషనల్ ఉమెన్ అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజిని దృష్టికి తీసుకువెళ్లారు. గత రెండు నెలలు నుంచి కాళ్ల పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగారు. చిట్టీల నిర్వాహకురాలి నుంచి తమ కుటుంబాన్ని, తమను కాపాడాలని బాధితులు భీమవరం డిఎస్‌పిని కోరారు. భీమవరం డిఎస్‌పి స్పందిస్తూ కాళ్ల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐకి ఫోన్ చేసి బాధితులకు తగు న్యాయం చేయాలని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఈనెల 16వ తేదీన కేసు నమోదు చేశారు. తమకు న్యాయం చేయాలని ఎస్‌ఐ శ్రీనివాసరావునుని కోరారు. కేసు నమోదు చేసిన బాధితులకు న్యాయం జరగలేదు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# ముంపులోనే వరి చేలు

అన్నదాతల ఆందోళన

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్లు


పెనుమంచిలిలో ముంపులోనే ఉన్న వరి చేలు

**ప్రజాశక్తి - ఆచంట**

ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా భారీ వర్షాలకు రైతన్నలు నిండా మునిగారు. మండలంలో 10,300 ఎకరాల్లో సార్వా సాగవుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో 800 ఎకరాల్లో ముంపుకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడు రోజులుగా కుండపోతగా వర్షం కురవడంతో పల్లపు పంట పొలాలు నీట మునిగాయి. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం ఆచంటలో సుమారు 100 ఎకరాలు, పెనుమంచిలిలో 400, వల్లూరులో సుమారు 150 ఎకరాలు, ఆచంట వేమవరం సుమారుగా 150 ఎకరాల్లో ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారులు ప్రకటించారు. దీన్ని బట్టి ఇక్కడ రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే రూ.12 నుంచి 14 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు అయోమయంలో పడ్డారు. గత ఏడు రోజుల నుంచి వరిచేలు ముంపులోనే ఉండటంతో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు ఇలానే ఉంటే కనీసం పెట్టుబడులు కూడా రావని అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెనుమంచిలిలోని కంకణాల కోడ్ మురుగు డ్రెయిన్‌కు అడ్డుకట్ట..**

పెనుమంచిలి గ్రామంలో ఉన్న పంట పొలాలకు ఆచంట నుంచి కానుపోతు గుంట కనకదుర్గమ్మ గుడి వెనకనున్న మురుగు కాలువపై సుమారు 15 అడుగుల వరకు అడ్డంగా గోడ కట్టి రెండు అడుగుల మేర చిన్న రంధ్రం ఏర్పాటు చేయడంతో పై పొలాల నుంచి వచ్చే మురుగు స్పీడుగా లాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యం కారణమని రైతులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు చొరవ చూపి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తే రెండు రోజుల్లో నీరులాగే పరిస్థితి ఉంటుందన్నారు.

**ఉండి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో పంటచేలకు ఆనుకుని ఆక్వా చెరువులు ఉండడంతో చేనులోంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట ముంపుకు గురవుతుందని, దీనివల్ల నష్టం తప్పట్లేదని, మురుగు డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేకపోయిందని రైతులు తెలిపారు.

### నీరు లాగే పరిస్థితి కనబడటం లేదు

**బొక్క తిరుమల రావు, రైతు కానుపోతు గుంట**

మురుగు నీరు వెళ్లేందుకు పైన కట్టవలసిన కంకణాల కోడ్ డామ్ కింద కట్టడంతో భారీ వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాల్లో ఉన్న నీరు లాగే పరిస్థితి కనిపించడం లేదు. పెనుమంచిలి గ్రామంలో సుమారు 180 ఎకరాల వరకు పంట పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే 7 రోజులైనా ఇంకా నీరు లాగా లేదు. ఇప్పటికే ఎకరానికి రూ.14 వేల వరకు ఖర్చు చేశాం. మరో రెండు రోజుల్లో నీరు లాగకపోతే పెట్టుబడులన్నీ నీళ్ల పాలైనట్లే.

### అధికారులు స్పందించాలి

**కానుమిల్లి జోగరాజు, రైతు ఆచంట**

కంకణాల కోడ్ డాం చుట్టుపక్కల పొలాలు అంటేనే కౌలు చేయడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ప్రతియేటా నిత్యం ముంపున కు గురవుతాయి. కంకణాల కోడ్ డాం తొలగించాలి. ఇప్పటికే నాట్లు కుళ్లు పోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు వచ్చి వెళ్తున్నారు తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

### ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేశాం

**మాదాసి గోపి, రైతు, ఉండి**

సార్వా పంటకు ఎకరానికి సుమారు రూ.20 వేలు ఖర్చు చేశాం. ఈ అల్పపీడనం వల్ల కురిసిన భారీ వర్షాలకు పంట ముంపుకు గురై తీవ్ర నష్టం మిగులుతుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు రూ.20 వేల నష్టపరిహారాన్ని అందించాలి.

### పంట, మురుగు కాలువలను ప్రక్షాళన చేయాలి

**దవిలి అప్పన్న, రైతు, ఉండి**

రైతులను ఆదుకునేందుకు అధికారులు వెంటనే పంట కాలువలతో పాటు మురుగు కాలువలను కూడా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. వాతావరణం బట్టి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ అధికారులు రైతులను కలిసి భరోసా కల్పించి, నివారణ చర్యలు తెలియజేయాలి.

పెనుమంట్రలో మునిగిన చేను చూపిస్తున్న రైతు వెంకటేశ్వర్లు

**పెనుమంట్ర :** గడచిన నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు గోస్తానీ నది పొంగడం వల్ల పొలంలో వరి పైరు పూర్తిగా నీట మునిగిందని మండలంలోని ఎస్ఐ పర్రు రైతు సానబోయిన వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం పైరు మునిగిన ప్రాంతంలో ఆయన మాట్లాడుతూ గోస్తానీ నది ముంపు వల్ల వర్షాలు కురిసిన ప్రతీ సారీ తీవ్రంగా నష్ట పోతున్నామని అన్నారు. గోస్తానీ నది మండలంలో ప్రవహించే కాలువలో పూడికలు, పెరిగిన తూటు సకాలంలో తొలగించడం చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్నారు.

## నీటమునిగిన పొలాల పరిశీలన

**పెనుమంట్ర :** మండలంలోని 7 గ్రామాలకు చెందిన 443 ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడిందని మండల వ్యవసాయాధికారిణి బి.దేవీ స్వరూప మంగళవారం ఇక్కడ తెలిపారు. ముంపు బారిన పడిన పొలాలను ఆమె సిబ్బందితో కలిసి సందర్శించి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎస్ఐ పర్రులో 210 ఎకరాలు, జుత్తిగలో 70 ఎకరాలు, మాముడూరులో 65 ఎకరాలు, పెనుమంట్రలో 35 ఎకరాలు, మల్లిపూడి లో 28 ఎకరాలు, నత్తా రామేశ్వరంలో 20 ఎకరాలు మేరకు ముంపులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**భీమవరం టౌన్ :** రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న భీమవరంలో వున్న అన్ని కోర్టుల ప్రాంగణంలో 'జాతీయ లోక్ అదాలత్' నిర్వహించడం జరుగుతుందని సంస్థ ఛైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీ దగ్గ క్రిమినల్ కేసులు, చెక్కు బాకీ కేసులు, భార్య భర్తల తగాదా కేసులు, మనోవర్తి, హింస కేసులు, చిట్ ఫండ్, ఫైనాన్స్ కంపెనీ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ మొండి బాకీ తదితర కేసులు రాజీ చేసుకోవచ్చున్నారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. జాతీయ లోక్ అదాలత్ వినియోగించుకుని కేసులను పరిష్కరించుకోవలసిందిగా కక్షిదారులకు విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయవలసిందిగా సూచించారు.

## వనువులమ్మ ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

**ఆకివీడు :** స్థానిక గ్రామ దేవత వనువులమ్మ దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణస్వీకారం మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎవి.సత్యనారాయణరాజు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థాన అర్చకులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా మొత్తం 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా కొల్లి వెంకన్న బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**పాలకొల్లు :** సైబర్ నేరగాళ్లు క్షణాల్లో మన ఫోన్లో ఉన్న వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించగలరని, యువత లోన్ యాప్‌లకు ఆకర్షితులు కాకూడదని పాలకొల్లు పట్టణ ఎస్ఐ పృథ్వీ కోరారు. దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లాటరీలకు సంబంధించి ఫోన్లలో వచ్చే సమాచారాన్ని క్లిక్ చేయకూడదని, ఆన్‌లైన్ షాపింగ్ విషయంలో జాగ్రత్త వహించాలని, అపరిచితులతో సోషల్ మీడియాలో చాటింగ్ చేయకూడదని చెప్పారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ సిస్టంను ప్రోత్సహించకూడదని, హనీ ట్రాప్ విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వివాహ సంబంధ విషయమై ఆన్‌లైన్ ద్వారా కాకుండా ముఖాముఖిగా మాట్లాడి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ పైవిషయాలపై ఇతరులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిదీ అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ ఉన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన


కాళ్ల సొసైటీలో అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - కాళ్ల**

ప్రభుత్వ సంస్థలపై ప్రజల నమ్మకాన్ని మెరుగుపరచడానికి సమాచార హక్కు చట్టం కీలకమైందని కాళ్ల సహకార బ్యాంకు సిఇఒ గనిశెట్టి వెంకట రామారావు(బాబ్జి) అన్నారు. కాళ్ల సొసైటీ ఆధ్వర్యాన సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహనా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది కొల్లి శ్రీనివాసులు, పుప్పాల చంద్రమౌళి, రైతులు పుప్పాల బుజ్జి, తుమ్మపూడి శివ పాల్గొన్నారు.

పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందే హక్కును కల్పిస్తుందని కాళ్లకూరు సహకార బ్యాంక్ సిఇఒ యిబ్బా శ్రీనివాస్ అన్నారు. కాళ్లకూరు సొసైటీ ఆధ్వర్యాన సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహనా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో సొసైటీ సిబ్బంది పి.రామకృష్ణంరాజు, వేగేశ్న ప్రకాష్ వర్మ, వి.సత్యనారాయణరాజు, ఎస్.త్రిమూర్తులు, జి.అప్పారావు, సిహెచ్. ప్రసాద్, సొసైటీ సబ్ సిబ్బంది జె.లక్ష్మి, యు.శ్రీనివాసరావు, రైతులు అవురు సోమేశ్వరరావు, నరసింహాచార్యులు, సామన శ్యాంబాబు, పి.వెంకట రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

**పాలకోడేరు :** సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శృంగవృక్షం సొసైటీ ఛైర్మన్ కలిదిండి కృష్ణంరాజు అన్నారు. గ్రామంలో సొసైటీ ఆధ్వర్యాన సమాచార హక్కు చట్టంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కృష్ణంరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. సమాచార హక్కు మన ప్రాథమిక హక్కు, సమాచార హక్కు జవాబు దారీ తనానికి భరోసా అని ప్లకార్డులతో నినాదాలు పలికారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరవల్లి శ్రీనివాస కుమార్, కడలి రంగారావు, కార్యదర్శి మేడిది గణపతి, రైతులు పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** మండలంలోని వెలగలేరు, కొయ్యేటిపాడు గ్రామాల్లోని వ్యవసాయ సొసైటీల ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005 అవగాహనా ర్యాలీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వెలగలేరు సొసైటీ ఛైర్మన్ బొక్కా నాగేశ్వరరావు, సభ్యులు మల్లిడి మీరా రెడ్డి, చిర్ల నాగేశ్వర రెడ్డి, సొసైటీ కార్యదర్శి తేతలి శ్రీనివాస రెడ్డి, కొయటిపాడు సొసైటీ ఛైర్మన్ పాలా భోగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల : సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ

# ప్రభుత్వ సొమ్ము కార్పొరేట్ల పాలు

సిఐటియు మహాసభలో వక్తలు

సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న సూరిబాబు

**ప్రజాశక్తి - ఉండి**

ప్రభుత్వ సొమ్ము కార్పొరేట్ల పాలవుతుందని, భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో శత కోటీశ్వరుల సంఖ్య రోజురోజుకీ పెరగడంతో పాటు నిరుపేదల సంఖ్య అదే స్థాయిలో పెరుగుతుందని సిఐటియు జిల్లా నాయకులు మంద సూరిబాబు, ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి ధ్వజమెత్తారు. సిఐటియు మహాసభ ఉండిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంద సూరిబాబు జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ ఎంతోమంది పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లుగా మారుస్తుందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి మాట్లాడుతూ నరేంద్ర మోడీ పాలనలో అంబానీ, ఆదానీ ఆస్తులు వేలకోట్లు పెరిగి ప్రపంచ కుబేరుల్లో తమ పేరు లిఖించుకున్నారని, వారికి బ్యాంకు రుణాలు రద్దుచేసి ఆ భారాన్ని పేద ప్రజల నెత్తిన మోపారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 16 మందితో కూడిన జిల్లా కమిటీని వారు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకటరత్నం, వీరవల్లి మాధవరావు, పిల్లి సుబ్బారావు, చిట్టి అన్నవరం, మోపిదేవి రాము పాల్గొన్నారు.

# గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలు : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

గత చరిత్రకు చిహ్నాలు ఛాయా చిత్రాలేనని, కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే కెమెరా కనుగొనకపోతే చరిత్రకు చిహ్నాలు లేవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మంగళవారం భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎంఎల్ఎ అంజిబాబు నివాసం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఏరియా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఫొటోగ్రఫీ ప్రాముఖ్యత సంతరించుకుందని, భీమవరం ఏరియా ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అద్వితీయమని, కెమెరా లేని భవిష్యత్ సమాజానికి చరిత్ర తెలియదని అన్నారు. అనంతరం 14 మంది సీనియర్ ఫొటోగ్రాఫర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాపర్లు ముక్కు సింహాద్రి, ఎస్.నాగు, శ్రీమన్నారాయణ, చెక్కు శ్రీరామమూర్తి, బాపిరాజు, కృష్ణంరాజు, బుజ్జి, అరసవల్లి సుబ్రమణ్యం, యర్రంశెట్టి శివకృష్ణ పాల్గొన్నారు.

**నరసాపురం :** నరసాపురం పట్టణంలో వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం నరసాపురం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. శివాలయం సెంటర్ దగ్గర కెమెర సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహానికి ఫొటోగ్రాఫర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఫొటో వృత్తిలో ఉన్న యజమానులను ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ ఉమా, సెక్రటరీ జి.రాంబాబు, ట్రెజరర్ బాలకృష్ణ, జిల్లా ప్రెసిడెంట్ క్యాపిటల్ రాజు, సంఘ సభ్యులు సందీప్, గౌస్, మీర్, మున్న, నాగేశ్వరరావు, రాజేంద్ర, పవన్, గోపి పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం ఫొటోగ్రాఫర్స్, అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గోల్డెన్ ఫొటో స్టూడియోలో ఫొటోగ్రఫీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ లూయిస్ డాగురేని స్ఫూర్తిగా తీసుకుని ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని ఎంతోమంది ఫొటోగ్రాఫర్స్ జీవనోపాధి పొందుతున్నారన్నారు. వారి కుటుంబ అవసరాలకు ఆసరాగా నిలుస్తున్నారన్నారు. అసోసియేషన్ సెక్రెటరీ అయితం ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ మరడాని పరుశురాం, తాడేపల్లిగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగాధర్, సెక్రెటరీ, అయితం ప్రసాద్, ట్రెజరర్ మండ పవన్, వైస్ ప్రెసిడెంట్ పెద్దోజు మురళీ, మానేపల్లి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

**మొగల్తూరు :** గతంలో జరిగిన తీపి జ్ఞాపకాలను చిత్ర రూపంలో ముందుంచేది ఫొటోగ్రాఫర్‌లని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు శేష అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మొగల్తూరు ఫొటోగ్రాఫర్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వంక రవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ల నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గొల్ల డేవిడ్, కుక్కల సత్యనారాయణ, తోట చిట్టిబాబు, ఎంవి.సత్యనారాయణ, కె.రాము, పాల్గొన్నారు.

**గణపవరం :** ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరం, నిడమర్రు మండలాల ఫొటోగ్రాపర్స్ కెమేరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గణపవరం సాయి ఫొటో స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, అధ్యక్షులు పూడిబాబి, ఉపాధ్యక్షులు శిరీష, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ప్రకాష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రేపు సీనియర్ సిటిజన్స్ హక్కులపై సెమినార్

**వీరవాసరం :** ఈనెల 21న సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా సీనియర్ సిటిజన్స్ హక్కులపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ప్రెసిడెంట్ గుండా రామకృష్ణ మంగళవారం తెలిపారు. వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్, కాపు వనిత క్లబ్, వీరవాసరం కళాపరిషత్‌ల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్స్‌కు కల్పిస్తున్న హక్కులు, వాటిరక్షణ వంటి విషయాలపై జిల్లా, రాష్ట్ర నాయకులు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## మత్స్య కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ మాధవి

**నరసాపురం :** మండలంలోని లక్ష్మణేశ్వరం మత్స్య కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.మాధవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మాధవి ముత్తుకూరు కళాశాలలో ఎఐఎం డిపార్ట్‌మెంట్‌లో హెడ్‌గా పనిచేసి నరసాపురం మత్స్య కళాశాలకు బదిలీగా వచ్చారు. ఈ కళాశాలలో ఇప్పటి వరకూ అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ టి.నీరజ, ముత్తుకూరు మత్స్య కళాశాలలో ఎఎహెచ్‌ఎం డిపార్ట్‌మెంట్ హెడ్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా వీరిరువురిని కళాశాల ప్రొఫెసర్, గెస్ట్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఎన్.వీరభద్రరావు, కె.శ్రావణి, ఎంఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం సురక్షితం : ఎంపిడిఒ

**పెనుగొండ :** రక్తదానం చేయడం సురక్షితమేనని ఎంపిడిఒ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో తణుకు హరిచంద్ర ప్రసాద్ రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రం ద్వారా రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో సర్జరీలకు, శిశు జననం మొదలుకొని సందర్భంలో రక్తం చాలా అవసరమని, రక్తదానం చేయడం వల్ల ప్రాణాన్ని కాపాడవచ్చుని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పి.రామకృష్ణ రక్తదానం చేశారు.

**In the Court of the I Addl. Civil Judge (Junior Division) Eluru, W.G.Dt.**

**I.A.No.29/2025 in O.S.No.167/2025**

Between:
Smt.Pothumarthi Padmavathi ...Petitioner/Plaintiff
And
Smt.Yarra Kumari and Others ...Respondents/Defendants

పై నంబరు పిటీషన్‌లో R2 అయిన Sri Yarra Ananda Kumar, S/o.Not Known, C/o.D.No.40-4-4-1, Sri Venkateswara Mayuri Tiffins and Meals Hotel, Canal Road, Eluru City and District. R3 అయిన Sri Chowdary Kamal Vishnu, S/o.Seetha Ramulu, C/o.D.No.40-4-4-1, Sri Venkateswara Mayuri Tiffins and Meals Hotel, Canal Road, Eluru City and District. అను వార్లకు నోటీసులు అమలు కొరకు ది.16-09-2025వ తేదీన వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

**E.SRINIVASA BABU**
ఏలూరు Advocate, Eluru.
తేది.19-08-2025 Ph:08812-239498

**In the Court of the I Addl. Civil Judge (Junior Division) Eluru, W.G.Dt.**

**O.S.No.167/2025**

Between:
Smt.Pothumarthi Padmavathi ...Plaintiff
And
Smt.Yarra Kumari and Others ...Defendants

పై నంబరు దావాలో D2 అయిన Sri Yarra Ananda Kumar, S/o.Not Known, C/o.D.No.40-4-4-1, Sri Venkateswara Mayuri Tiffins and Meals Hotel, Canal Road, Eluru City and District. D3 అయిన Sri Chowdary Kamal Vishnu, S/o.Seetha Ramulu, C/o.D.No.40-4-4-1, Sri Venkateswara Mayuri Tiffins and Meals Hotel, Canal Road, Eluru City and District. అను వార్లకు నోటీసులు అమలు కొరకు ది.16-09-2025వ తేదీన వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

**E.SRINIVASA BABU**
ఏలూరు Advocate, Eluru.
తేది.19-08-2025 Ph:08812-239498

**In the Court of the Principal civil Judge (Junior Division) At Tanuku**

**E.P.No.33/2025 in O.S.No.367/2023**

Between:
Borsu Veera Venkata Subrahmanyam ...D.H.R/Plaintiff
And
Reddy Veera Venkata Satya Narayana ...JDR/Defendant

**DHR వాది తరపున చేసిన ప్రకటన**

**JDR** : రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, S/o.వీరరాఘవులు, పురుషుడు, 55 సం॥లు, బిజినెస్, R/o.D.No.3-24/1, కెనాల్ వీధి, వేల్పూరు గ్రామం, తణుకు మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు E.P గ్రంథములో మీరు JDR అయివున్నారు. పైనంబరు E.P గ్రంథములో శ్రీకోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ప్రచురితమైన తేది నుండి 28-08-2025 తేదీన మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసినదిగాను అట్లు కాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**Neelam Harish Naidu**
Advocate, Tanuku.
Cell: 9293222187

పల్లె ప్రతిభకు పట్టం.. ట్రిపుల్ ఐటీ 8లో

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
ఆగస్టు 2025
8 పేజీలు
Advt.feature 3

# ప్రజల శక్తిగా.. నాలుగున్నర దశాబ్దాలు..



విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికను ప్రారంభిస్తున్న ఇఎంఎస్ నంబూద్రిపాద్ తో సుందరయ్య (1981)

ప్రజాశక్తి దిపపత్రిక నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకుని 45వ వార్షికోత్సవ ఘట్టంలో అడుగెట్టింది. కమ్యూనిస్టు ఉద్యమ నేతగా, ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడుగా స్ఫూర్తినిచ్చిన మోటూరు హనుమంతరావు గారి పేరిట నెలకొల్పిన అవార్డు ప్రదానం జరగునున్నది. అక్షరాక్షర దీక్షగా / ఆశయాలే రక్షగా / నడచి వచ్చిన దారులు / నిలిచి గెలిచిన తీరులు ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. 1942లో ప్రజాశక్తి వారపత్రికగా ప్రారంభమై 45లో దినపత్రికగా మారింది. ఆ విధంగా చూస్తే ఇది ఎనభయ్యవ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడంలోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప చేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు వరవడి, భావాలకు వరిపిడి అయింది. 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. నిజాం నవాబు కూడా హైదరాబాద్ సంస్థానంలో నిషేధించాడు. నూతన స్వాతంత్రం, రాష్ట్రాల ఏర్పాటు, ఎన్నికలు తదితర పరిణామాల మధ్య మళ్లీ 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారి విశాలాంధ్ర పేరుతో పున:ప్రారంభమైంది. రాజకీయ సిద్ధాంత కారణాల వల్ల మధ్యలో కొంతకాలం జనశక్తిగా వెలువడింది. మళ్లీ ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటవ తేదీన దినపత్రికగా అవతరించింది.

ఈ నలభై అయిదేళ్ల కాలంలో అంతర్జాతీయంగానూ, దేశంలోనూ లౌకిక ప్రగతిశీల శక్తులు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశాయి. అనేక ఎదురు దెబ్బలూ తగిలాయి. 1981 అఖిలపక్ష ఉద్యమం, 1982లో సిపిఎం అఖిల భారత మహాసభల మహా సమీకరణ తర్వాత 83 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారు. 1984లో సానుభూతి పవనాలతో రాజీవ్ గాంధీ గద్దెనెక్కారు. 1990లలో సోషలిస్టు శిబిరంలో కల్లోలం చెలరేగి చివరకు 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైంది. దేశంలో సరికొత్త ఆర్థిక విధానాలు, వాటిని వెంటనంటి రాజకీయాలలో మితవాద, మతవాద దాడి మొదలైనాయి. చివరకు 1998లో బిజెపి అధికారం చేపట్టింది. రాష్ట్రంలో తెలుగుదేశం దానితో జత కట్టి మరోసారి అధికారంలోకి వచ్చి ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయడంలో ప్రథమ పీఠిన నిలిచింది. ఆ సమయంలో సాగిన విద్యుచ్ఛక్తి ఉద్యమానికి ప్రజాశక్తి ప్రాణవాయువులా సేవ చేసింది. 2004లో వై.ఎస్ ప్రభుత్వం వచ్చాక భూపోరాటం వంటివి జరిగాయి. తెలంగాణ ఏర్పాటుకు ఉద్యమంతో 2014 ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఎ.పి లో టిడిపి, వైసిపి పాలన మళ్లీ ఇప్పుడు టిడిపి కూటమి పాలన సాగుతున్నది. కేంద్రంలో బిజెపి ఆధిక్యత కోల్పోయినా ఈ పార్టీల మద్దతుతో మూడోసారి వచ్చిన మోడీ ప్రభుత్వం కరుడుగట్టిన మతతత్వం ..2లో

(మొదటి పేజీ నుంచి)

కార్పొరేట్ తత్వం సామ్రాజ్యవాద అనుకూలతల కలయికగా సాగుతున్నది. రాజకీయ పరిస్థితులు ఎన్ని విధాలుగా మారి ఎన్ని సవాళ్లు వచ్చినా ఈ దశలన్నిటా ప్రజాశక్తి ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేదికగా నిలిచింది. తీవ్రమైన కరోనా తాకిడితో సహా చాలా సమస్యలను అధిగమించింది.

# ప్రజల శక్తిగా నాలుగున్నర దశాబ్దాలు

**మోటూరు విలక్షణ పాత్ర**

ఎంహెచ్‌గా సుపరిచితులైన మోటూరు హనుమంతరావు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు అవరోధాలకు తలవంచని ధీశాలి. తెలుగునాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. 2001లో ఆయన కన్నుమూత తర్వాత గడచిన దాదాపు పాతికేళ్ల కాలంలో ఈ కృషి కొనసాగుతున్నది. అంకితభావంగల నాయకత్వం సంపాదకులు, పాత్రికేయులు, కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు, పత్రిక శ్రేయోభిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి. ఆయన స్మారకార్థం అవార్డును నెలకొల్పి అన్ని పత్రికల నుంచి అర్థవంతమైన కథనాలు ఆహ్వానించి కమిటీ ద్వారా ఎంపిక చేసి అవార్డు ఇవ్వడం కరోనా సమయంలో తప్ప క్రమం తప్పకుండా జరగడం అభినందనీయం. 1945 నుంచి ఆఖరి శ్వాస వరకూ అన్ని దశల్లో ప్రజాశక్తితో లీనమై ప్రజాశక్తిమంతుడు అనిపించుకున్న వి.ఆర్.బొమ్మారెడ్డి పత్రికా ప్రపంచంలో పితామహుల వంటి వారు. ఆయన ఆఖరి కోరిక మేరకు ప్రజాశక్తి పాత్రికేయుల కథనాలను బట్టి ఎంపిక చేసి అంతర్గత అవార్డు అందజేయడం జరుగుతున్నది. ఈ పెద్దలతో పాటు ఉద్యమ పత్రికల కోసం వివిధ దశల్లో ఎనలేని కృషి చేసిన డి.వి.సుబ్బారావు, నాగులపల్లి కోటేశ్వరరావు, ఎల్.జోగారావు, తుమ్మల వెంకట సుబ్బయ్య, ఎ.కె.ఆర్.బి.కోటేశ్వరరావు, గోళ్ల రాధాకృష్ణ మూర్తి తదితర అమరజీవులను కూడా గుర్తు చేసుకుందాం.

ఈ నలభై అయిదేళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది. ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం నిరతం కృషి చేస్తున్నారు. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతున్నది. తెలుగు మీడియా ముఖ్యులలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ సోషల్ మీడియాలోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు మీడియాను వేటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాలలో మునిగితేలుతున్నాయి.

అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ వుండదు. రైతాంగ ఆందోళన, మితవాద విజృంభణ, లాటిన్ అమెరికా పరిణామాలు ఏదైనాసరే వీటికి అవసరం లేని పని, మోడీ మన్ కీ బాత్ వాటికి వేద వాక్యం. వ్యూస్ కోసం రేటింగుల కోసం వాస్తవాలతో నిమిత్తం లేని కథనాలు వండి వారుస్తుంటాయి. ఎ.పి లోనే చూస్తే కార్పొరేట్లకు భూపందేరాల భాగోతాలు విశాఖ ఉక్కుతో సహా ప్రైవేటీకరణ పోకడలు వీటికి సమస్యలే కాదు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వి తీస్తున్నా దాదాపు కనిపించదు. తాము బలపర్చే పక్షాల్ని తలకెత్తుకోడం, అవతలి పక్షంపై దాడి చేయడం అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరో వైపు మీడియాపై దాడి చేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ప్రజాశక్తి వీటికి అతీతంగా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రస్థానం సాగిస్తున్నది.

**ప్రత్యామ్నాయ మార్గంలో..**

ఒకప్పుడు మిగిలిన వాటిని మెయిన్ స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి ప్రజల (మెయిన్) స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆయా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా మారాయి. విశ్వసనీయత, స్వతంత్రత, నిష్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యథార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నది ప్రజాపత్రికలే. అందుకే ప్రజలు వాటిని గౌరవిస్తారు. అయితే రానురాను పాలక వర్గాల ప్రతీప శక్తుల సవాళ్లు తీవ్రమవుతాయి. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు ఎప్పుడూ సింహస్వప్నమే. అందుకే మోడీ అధికారంలోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమై పోతున్నది. సుప్రీంకోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. సభకు విచ్చేసిన ప్రబీర్ పురకాయస్త వంటివారు ఈ పోరాటానికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఇలాంటి జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగున్నర దశాబ్దాలు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక మరింత విశ్వాసమిస్తుంది. చారిత్రాత్మక ఢిల్లీ రైతు ఉద్యమం, ఇటీవలి ఎన్నికలలో లౌకిక శక్తుల బలం పెరగడం, కేంద్రంలో మోడీ దూకుడుకు ప్రజలు పగ్గాలు వేయడం ప్రజాశక్తి వంటి పత్రికల కృషికి ఉత్సాహమిచ్చే పరిణామం. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఏరో స్పేస్ కోసం భూసేకరణ నిలిపేయడం గానీ, ఎ.పి లో అదానీ సంస్థలు రెంటినీ విరమించుకోవడం గానీ ప్రజా విజయాలే. కానీ ఇంకా జరగవలసిన పోరాటం మరెంతో వుందని గుర్తించాలి. మోటూరు వంటి యోధుల జీవితాలు, కృషి అందుకు ఆదర్శంగా నిలుస్తాయి. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ ఆ దిశగా అడుగులు వేద్దాం.

**– తెలకపల్లి రవి**

# మహిళల స్వయం సమృద్ధి కోసం రుణాలు

**ముసునూరు వెలుగు ఎపిఎం కోమటి రాంబాబు**

ఎపిఎం కోమటి రాంబాబు

ప్రజాశక్తి - ముసునూరు

పొదుపు సంఘాల కార్య కలాపాలు స్వయం సంఘాల సభ్యుల బలోపేతానికి, కుటుంబ, వ్యాపార అవసరాల కోసం రుణాలు ఆందించేందుకు వీలుగా ప్రభుత్వం కొత్త విధానాలను అమలు చేస్తుందని ముసునూరు వెలుగు ఎపిఎం కోమటి రాంబాబు చెప్పారు. క్షేత్రస్థాయిలో మహిళలు ఎంతవరకు లబ్ధి పొందుతున్నారనే దానిపై ప్రజాశక్తితో ఆయన ముచ్చటించారు.

**ప్రశ్న : ముసునూరు మండలంలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి? అందులో ఎంత మంది సభ్యులు ఉన్నారు?**

**ఎపిఎం :** మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 488 స్వయం సహాయక సంఘాల్లో 14,729 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజి రుణాలతో పాటు వివిధ రుపాల్లో నాలుగు శాతం (35)శాతం వడ్డీపై రుణాలు ఆందిస్తాం.

**ప్రశ్న : ప్రస్తుతం టార్కెట్ వివరాలు ఏమిటి?**

**ఎపిఎం :** గతేడాది రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తి చేశాం. ఈ ఏడాది స్త్రీనిధి రూ.12 కోట్లు, బ్యాంక్ లింకేజి రుణాలు రూ.55 కోట్లు, ఉన్నతి రూ.40 లక్షల వరకు రుణ సాయం అందించేందుకు ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి సర్వే చేస్తున్నాం. ప్రతి ఎనిమిది సంఘాలకు ఒక యానిమేటర్‌ను ఎంపిక చేసి గ్రూపు సభ్యులకు ఎలాంటి రుణసాయం కావాలో వివరాలు అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. యాప్‌లో చేసిన వివరాలు కమ్యూనిటి క్లస్టర్ల (సీసీ) లాగిన్ నుంచి, ఎపిఎం లాగిన్‌కు వస్తాయి. వాటిని పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణ సాయానికి బ్యాంకర్లకు సిఫార్సు చేస్తాం.

**ప్రశ్న :** విఒఎలు (గ్రామ సంఘ సహాయకులు) ఎంత మంది ఉన్నారు?

**ఎపిఎం :** 45 మంది విఒఎలు ఉన్నారు. ప్రతి డ్వాక్రా సంఘంలో పది మంది సభ్యులు కచ్చితంగా స్థానికులే ఉంటారు. గ్రూపు సభ్యులకు రికవరీ ప్రకారం రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఆందిస్తాం. ప్రస్తుతం ప్రతి సభ్యురాలి వివరాలు జియో ట్యాగింగ్ చేస్తున్నాం. గ్రూపులో సభ్యులందరూ ఒకే ఏరియాలో ఉండాలి. జియో ట్యాగింగ్ ప్రకారం గ్రూపు సభ్యులందరూ ఒకే ఏరియాలో ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి బ్యాంకర్ల ద్వారా రుణాలు అందిస్తాం.

**ప్రశ్న : విఒఎలుగా ఎవరిని నియమిస్తున్నారు?**

**ఎపిఎం :** మార్గ దర్శకాల ప్రకారం విఒఎలుగా నియమితులయ్యేవారు కచ్చితంగా ఆ డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలి

# ప్రగతి పథంలో రావిచర్ల

## సర్పంచి కాపా సారధ్యంలో అభివృద్ధి శరవేగం

## రాష్ట్రంలో మోడల్ విలేజ్‌గా రావిచర్లను తీర్చిదిద్దేందుకు కృషి

రావిచర్ల సచివాలయం



సర్పంచి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలం రావిచర్ల గ్రామాన్ని ప్రగతి పథంలో శరవేగంగా పయనింపజేసేందుకు కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు అవసరమైన అన్ని సౌకర్యాలను వేగంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎప్పుడో ఇచ్చే ప్రభుత్వ నిధులతో కాకుండా సొంత నిధులు సుమారు రూ.కోటి వెచ్చించి గ్రామ అభివృద్దే ధ్యేయంగా ముందడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తాను గ్రామ సర్పంచిగా 2013 నుంచి 2019 వరకు బాధ్యతలు నిర్వర్తించానని, వైసిపి హయాంలో 2021లో మళ్లీ గ్రామ సర్పంచిగా ఎన్నికై అభివృద్ధే ధ్యేయంగా ఎంతో కృషి చేశానని చెప్పారు. గ్రామ పంచాయతీల నిధులు ప్రభుత్వం దారి మళ్లించిందని, గ్రామపంచాయతీల స్వపరిపాలన హక్కును హరించడం తగదని చెప్పారు. 2021 ఏప్రిల్ నుంచి మే మాసాంతం లోపు రూ.30 లక్షలతో సీసీ డ్రెయిన్లు, 2022లో రూ.18 లక్షలతో సీసీ డ్రెయిన్, 15వ ఆర్థిక సంఘం - జనరల్ ఫండ్‌తో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా 2024లో రూ.ఎనిమిది లక్షలతో గ్రావెల్ రోడ్డు, ప్రస్తుతం రూ.పది లక్షలతో సీసీ డ్రెయిన్, రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు.

### సొంత నిధులతో గ్రామాభివృద్ధి

స్థానికంగా ఉన్న పెద్దలు, అన్ని తరగతుల ప్రజలతో చర్చించి ప్రణాళికలు రూపొందించి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని చెప్పారు. ఆ మేరకు సొంత నిధులు రూ.పది లక్షలతో మూడు సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో రైతుల సాగు భూముల వైపు మూడు కిలోమీటర్ల రోడ్డు, పాత రావిచెర్లలో రూ.20 లక్షలతో గ్రావెల్ రోడ్డు, పాత రావిచెర్లలో రూ.12 లక్షలతో సీసీ డ్రెయిన్లు, మార్జిన్లు నిర్మించినట్లు తెలిపారు. వీటి నిర్మాణంతో రైతాంగం పంట భూముల నుంచి దిగుబడులను ఎంతో సునాయాసంగా మార్కెటింగ్‌కు తరలించే అవకాశం ఏర్పడిందని చెప్పారు. సొంత నిధులు గ్రామానికి రూ.70 లక్షలు వినియోగించినట్లు చెప్పారు. గ్రామంలో నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డుకు రూ.30 లక్షలు, మూడు సీసీ రోడ్లకు రూ.పది లక్షలు, రూ.12 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రోడ్డు మార్జిన్లు నిర్మించినట్లు తెలిపారు. రూ.రెండు లక్షలతో సీసీ రోడ్డు మార్జిన్లు, రూ.12 లక్షలతో చెరువు చుట్టూ రహదారి, తూము, వాకింగ్ ట్రాక్ నిర్మించినట్లు తెలిపారు. దీంతో పెద్ద చెరువు ఎంతో సుందరంగా గ్రామానికి మణిహారంలా అందరి చూపు ఆకర్షించిందన్నారు. నిత్యం ఈ చెరువు గట్టు వెంట ఉదయం, సాయంత్రం గ్రామస్తులు నడుస్తున్నారని తెలిపారు. గ్రామంలో అభివృద్ధితో పాటు పరిశుభ్రతకు కూడా పెద్దపీట వేసినట్లు తెలిపారు. సంపద సృష్టి కేంద్రాన్ని రూ.మూడు లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. ఎక్కడా చెత్త కుప్పలు కనిపించకుండా చర్యలు చేపట్టి గ్రీన్ అంబాసిడర్లు స్వయంగా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రానికి తరలించడం ద్వారా గ్రామం ఎంతో సుందరంగా రమణీయంగా పరిశుభ్రంగా నిత్యం దర్శనమిస్తోందని తెలిపారు.

### ప్రణాళికలోని లక్ష్యాలు

తాను ఓ బృహత్తరమైన ప్రణాళిక ద్వారా గ్రామాభివృద్ధి సాధించడంతో పాటు రావిచర్లను రాష్ట్ర స్థాయిలో మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని కలిగి ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే తన లక్ష్యాన్ని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర విద్య, సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధిలకు తన ప్రణాళికను హేతుబద్ధంగా వివరించినట్లు తెలిపారు.

గ్రామంలోని 40 ఏళ్ల నాటి మరమ్మతులకు గురయ్యే పైపులైను పూర్తిగా తొలగించి సుమారు రూ.50 లక్షలతో కొత్తగా వాటర్ పైపులైను ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. వైసిపి హయాంలో గ్రామాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రస్తుతం గ్రామంలో సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రాలను, బిసి ఏరియాలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించాలన్నారు. నిరుపేదల అభ్యున్నతి కోసం రూ.30 లక్షలతో స్థలాలను గతంలో చదును చేశామని, వైసిపి హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో లక్ష్యాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇక్కడ మరో రూ.పది లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయడం ద్వారా అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఫ్యాక్టరీలు ఉన్న ప్రాంతంలో రూ.1.50 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇప్పటికే గ్రామ అభివృద్ధి కోసం రూ.25 లక్షల కేటాయించడం పట్ల ప్రజలందరి తరపున సర్పంచి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

### హైలెట్‌గా పైలెట్ ప్రాజెక్టు

గ్రామాభివృద్ధిలో అంతర్భాగంగా పైలెట్ ప్రాజెక్టు నిలుస్తుందని సర్పంచి కాపా తెలిపారు. సుమారు 53 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువు పైలెట్ ప్రాజెక్టుగా రూపాంతరం చెందితే వెయ్యి ఎకరాలకు నిరంతరాయంగా నీటిని అందించవచ్చున్నారు. ఈ చెరువుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ద్వారా 30 నుంచి 40 మీటర్ల లోతు తీయడంతో వర్షపు నీటిని ఒడిసి పట్టి నిల్వ చేయవచ్చున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే అక్కడి జలాలను ఈ చెరువులో నిల్వ ఉంచే సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. నేడు ఉన్న పరిస్థితుల్లో రెండు రావిచర్ల గ్రామాల్లో సుమారు 300 మోటార్లు నిత్యం పనిచేయడం వల్ల ప్రభుత్వానికి రూ.1.50 కోట్ల ఖర్చవుతుందన్నారు. గ్రామంలోని పెద్ద చెరువును పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడం ద్వారా వందలాది మోటార్లు ఎక్కువ సమయం పని చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఒకపక్క విద్యుత్ ఆదా, మరో పక్క ప్రభుత్వ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. సకాలంలో నీటిని అందించడం ద్వారా, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడంతో మాత్రమే రైతు రాజు కాగలడని వివరించారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు, ఇతర రాయితీలు అందించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఇలా రాయితీలు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకించనని, రైతుల ప్రధానమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా మాత్రమే వ్యవసాయం అభివృద్ధి సాధించగలదని సోదాహరణంగా వివరించారు. నియోజకవర్గంలోని 87 గ్రామాల్లో ఇలా చెరువుల అభివృద్ధి చేయడం ద్వారా నీటిని నిల్వ ఉంచడంతో పంటలు సస్యశ్యామలంగా పండుతాయన్నారు. ఇక వ్యవసాయ దిగుబడులకు గిట్టుబాటు ధరలను ప్రభుత్వం కచ్చితంగా కల్పిస్తే రైతు శాశ్వత రాజు గానే రూపాంతరం చెందుతాడన్నారు. ఇలా పైలట్ ప్రాజెక్టులు ప్రతి గ్రామంలో అమలు చేస్తే, రూ.వేల కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి కోసం ఇప్పటి నుంచి రైతులు ఎదురుచూసే పరిస్థితి ఉండదన్నారు. స్వయం జల సమృద్ధితో ప్రతి పల్లె పచ్చని తోరణంగా మారుతుందని వివరించారు.

# చరిత్ర ఎరుగని సత్యం..!

జమీందారులు దానం ఇచ్చిన ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్

## సిపాయిల తొలి తిరుగుబాటు 1857గా చరిత్ర లిఖితం

## నూజివీడు సంస్థానంలో 1783లోనే బ్రిటిష్ పాలకులపై భీకర పోరు

కుక్కల గేటు, గుర్రం గేటు

ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

చరిత్ర ఎరుగని ఎన్నో నిజాలు.... సామాన్యులు తెలుసుకోక... చరిత్ర చెప్పిందే నిజంగా భావిస్తూ తరాలు గడిచాయి. చరిత్రకారుల అవగాహన లోపమా.... చరిత్రలో దక్షిణ భారతదేశానికి జరుగుతున్న అన్యాయమో.... ఏది ఏమైనా చరిత్ర ఎరుగని నిజాలు గ్రంథాలకు.... రికార్డులకు పరిమితమయ్యాయి. అలాంటి వాటిలో బ్రిటిష్ పాలకులపై నూజివీడు సంస్థానాధిసుల వీరోచిత పోరాట చరిత్ర నేటి తరానికి తెలియాలి.

రెబల్ నారయ్యప్పారావుగా ఖ్యాతి పొందిన నరసింహ అప్పరాయలు బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటం చేసి విజయం సాధించారు. బ్రిటిష్ దళాలు 21 రోజులు నూజివీడు సంస్థాన కోటను ముట్టడించాయి. ఆనాడు 20 నవంబర్ 1783 నుంచి 10 డిసెంబర్ 1783 వరకు కోటను ముట్టడించినట్లు మచిలీపట్నంలోని బ్రిటిష్ రికార్డుల్లో నేటికీ పదిలంగానే ఉన్నాయి. కోటను ముట్టడించినప్పటికీ తూటా పేల్చేందుకు సేనాని మౌంట్ గుమ్మరికి ఏమాత్రం సాహసం సరిపోలేదు. కోట ముట్టడిలో ఉన్న కోట లోపలకు ప్రవేశించే సర్దార్లు, సైనికులు తూటా పేల్చే సాహసం చేయలేకపోయారు. కోటపై తూటా పేల్చితే అడకత్తెరలో ఇరుక్కుని ఇబ్బందులు తప్పవని ఆనాడే బ్రిటిష్ సేనలు గ్రహించాయి. అంతకుముందే సిద్ధం చేసుకున్న వ్యూహం ప్రకారం తెల్లవారుజామున రెబెల్ నారయ్యప్పారావు నాలుగు పక్కల నుంచి ఒకేసారి యుద్ధం ప్రారంభించారు. హఠాత్ పరిణామంతో బ్రిటిష్ సేనలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. బ్రిటిష్ సైనికులు కలవరపడక తప్పలేదు. ఈ పోరాటంలో లెఫ్టినెంట్, 14 మంది బ్రిటిష్ సైనికులను, 1080 మంది సిపాయిలను కోల్పోయినట్లు మౌంట్ గోమరి తన రిపోర్టులో స్వయంగా రాసుకుంది. మచిలీపట్నంలోని బ్రిటిష్ రికార్డుల ప్రకారం ఇదే విషయాన్ని 28 నవంబర్ 1783 నుంచి 15 డిసెంబర్ 1783 మధ్య జరిగిన పరిణామాలను మచిలీపట్నం చీఫ్ కౌన్సిల్‌కు బ్రిటిష్ ప్రతినిధి డానియల్ రాసిన లేఖలు నేటికీ భద్రంగానే ఉన్నాయి.

ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన నూజివీడు సంస్థాన వీరోచిత పోరాట ఘట్టాలను చరిత్ర వెలుగులోకి తీసుకురాకపోవచ్చు.... వాస్తవం ఎప్పటికీ అవాస్తవం కానరదని దక్షిణ భారత చరిత్రకారులు వ్యాఖ్యానిస్తున్నారు.

## నూరు శాతం ఉత్తీర్ణత మా విద్యార్థుల ఘనత

### ముసునూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి

లక్ష్మీకుమారి

**ప్రజాశక్తి - ముసునూరు**

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మా పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరుస్తున్నారని ముసునూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ పాఠశాలలో మంచి తరగతి గదులతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. తమ విద్యార్థులు పూర్తిస్థాయిలో ఇంగ్లీషులోనే మాట్లాడేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కొన్నేళ్ల నుంచి మండలంలోని 16 గ్రామాల్లోని వివిధ పాఠశాలలతో పోల్చుకుంటే మా పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారన్నారు. నూటికి నూరు శాతం విజయం సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఘనత మా గురుకుల పాఠశాలకే దక్కుతుందని తెలిపారు.

## కెడిసిసిలో తక్కువ వడ్డీతో అధిక రుణాలు

### బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకట రంగ ప్రసాద్

వెంకటరంగప్రసాద్

**ప్రజాశక్తి - ముసునూరు**

వ్యవసాయ భూమి పరిమితిని బట్టి తక్కువ వడ్డీతో ఎంతోమంది రైతు సోదరులకు కెడిసిసి బ్యాంక్ రుణ సౌకర్యం కల్పిస్తుందని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకట రంగ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల కేంద్రమైన ముసునూరులోని కెడిసిసి బ్యాంక్ పరిధిలో మండలంలోని 16 గ్రామాల వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని రైతులందరికీ వ్యవసాయ భూమిపై స్వల్ప కాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. వీటిలో దీర్ఘ కాలిక రుణాలైనా ఎల్‌టిలోనూ, కర్షక మిత్ర, రైతు నేస్తం, నూతన ట్రాక్టర్ల కోసం, ఎడ్ల బండి, కోళ్ల ఫారం, పందుల పెంపకం, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకంపై రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఏడు సొసైటీల్లో రూ.800 కోట్లలో టర్నోవర్ అవుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రుణ సౌకర్యంతో పాటు వ్యాపార అభివృద్ధికి కూడా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలు పొందిన రైతులు నెల నెలా త్రైమాసిక, ఆరునెలలకోసారి, సంవత్సరానికోరి వడ్డీతో సహా అసలు కలిపి నగదు జమ చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ వారి సూచనల మేరకు గోల్డ్ లోన్ బంగారాన్ని బట్టి అధిక మొత్తంలో తక్కువ వడ్డీకి ఎక్కువ నగదు ఇచ్చే విధంగా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

**పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మనం వారి ఆకాంక్షలను గమనిస్తూ వుండాలి. వాటి వెనక వున్న వారి ఆకాంక్షలు అర్థం చేసుకుంటూ వుండాలి. వాటికి మనం చేయూతనిస్తే...ఆ పిల్లలే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు.**

**- గిజుభాయి, ప్రసిద్ధ విద్యావేత్త.**

# దసరా వచ్చింది.. సరదా తెచ్చింది

## నూజివీడు వేడుకలను వీక్షించాల్సిందే...

**'దసరా వచ్చిందయ్యా..సరదా తెచ్చిందయ్యా దశమి వచ్చిందయ్యా...దశనే మార్చిందయ్యా జయహో దుర్గాభవానీ...హోయ్ వెయ్యరో పువ్వుల హారాన్ని ...హోయ్ అంటూ సాగే ఈ పాట బాలకృష్ణ నటించిన లారీ డ్రైవర్ సినిమాలోనిది. దసరా ప్రాముఖ్యతను తెలియజేస్తూ సాగిన ఈ పాట ఆద్యంతం పండుగ ప్రాశ్యత్తాన్ని తెలియజేస్తుంది.**

ఏ పండుగ సందర్భంలో ఆ పండుగకు సంబంధించిన పాటలను పాటుకోవటం పల్లెసీమల్లో ప్రతిచోటా తారసపడేదే..మిగతా పండుగల సంగతి ఎలా ఉన్నా...దసరా పండుగంటే ఓ ఉత్సాహం..మరోరకమైన సరదా...అదే దసరా...మిగతా పండుగల సంగతి అటుంచితే దసరా పండుగలో దర్శనమిచ్చే కళారూపాలు ఆద్యంతం ఆకట్టుకుంటూ ఉంటాయి. 'అయ్యవారికి చాలు ఐదు వలహాలు...పిల్లలకు చాలు పప్పుబెల్లాలు' అంటూ సాగే పిల్లల సరదాలు దసరా వేడుకల్లో ముచ్చటగొల్పుతాయి. ఏటేటా దసరా ఉత్సవాల్లో సరికొత్తగా సాగుతుండటం, పండుగ చేసుకోవటం తెలుగువారికి తెలిసిందే.. రాష్ట్రంలో విజయవాడతోపాటుగా నూజివీడులో దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి.

దసరా నిజంగా అందరికీ సరదా పంచే పండుగే. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతిరూపంగా ఈ పండుగను దేశవ్యాప్తంగా ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. మనదేశంలో మైసూర్ తర్వాత అంతటి ప్రాముఖ్యతతో జరుపుకునేది రాష్ట్రంలోని ఏలూరు జిల్లా నూజివీడులోనే. అందుకే నూజివీడును ఆంధ్రా మైసూరు, సెకండ్ మైసూరుగా పిలుస్తుంటారు. ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా దసరా పండుగకు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ తమ సొంత ప్రాంతమైన నూజివీడుకు వచ్చి దసరా ఉత్సవాలను వీక్షించటం ఇక్కడి ప్రజలకు ఆనాయితీ. ఇంకో మరో ముఖ్యమైన విషయమేమిటంటే కులం, మతం, ప్రాంతం అంటూ ఎలాంటి బేధాలు లేకుండా అందరూ ఐక్యంగా జరుపుకునే పండుగ ఇది. ఈ ప్రాంతంలోనూ అన్ని ఆలాయాలు, చర్చిలు, మసీదులు ఉన్నా వాటి ప్రాంగణాల్లో మాత్రమే ఆరాధిస్తుంటారు. మిగతా చోట్ల ఏమాత్రం బేషజాలుండవు. అన్ని పనుల్లో సమైక్యతా భావన అడుగడుగునా తొణికిసలాడుతుంటుంది.

### పండుగ ఏదైనా ఐక్యమత్యంతోనే...

సంక్రాంతి, దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ ఇలా పండుగ ఏదైనా నూజివీడు ప్రాంతంలో ఎలాంటి బేషజాలు లేకుండా అందరూ ఐక్యంగా జరుపుకుంటూ వస్తుండటం ఆనవాయితీగా కొనసాగుతోంది. పరస్పర సహకారంతో ఈ పండుగల్లో పాల్గొనటం ద్వారా మతసామరస్యం ఇక్కడి వెల్లివిరుస్తుందనటంలో ఎలాంటి అతిశయోక్తికాదు. దసరా ఉత్సవాల నిర్వహణలోనూ, కమిటీల్లోనూ, దుకాణాల ఏర్పాటు, కళారూపాల ప్రదర్శనలు ఇలా ఏ కార్యక్రమం తలపెట్టినా కుల,మతాలకు అతీతంగా అందరూ పాల్గొనటం ఇక్కడి చైతన్యానికి ప్రతిరూపం. నూజివీడు పట్టణంలోని రామాయమ్మారావుపేట వినాయకచవితి వేడుకల్లోనూ మతసామరస్యం వెల్లివిరిసింది. స్థానికంగా ఉన్న ముస్లిం యువకుడు హుస్సేన్ చవితి వేడుకల్లో గణేష్ లడ్డూ ప్రసాదాన్ని రూ.8111కు దక్కించుకున్నాడు. సంప్రదాయబద్ధంగా తలకు కండువా చుట్టుకుని వేలంపాటలో దక్కించుకుని లడ్డూప్రసాదాన్ని శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపుగా తన ఇంటికి తీసుకెళ్లారు.

### అంబరాన్నంటే సంబరాలు

ప్రపంచంలో కర్నాటక రాష్ట్రంలోని మైసూరులో దసరా ఉత్సవాలు ఎంతో పేర్గాంచాయి. ఆంధ్రా మైసూరుగా నూజివీడు పేరుగాంచింది. దాదాపుగా 116 సంవత్సరాలపాటు క్రమం తప్పకుండా నిర్విరామంగా ఈ మహోత్సవాలను ఇక్కడి జమీందారులు నిర్వహిస్తూ వస్తున్నారు. 1952 నుంచి 2024 వరకూ కొనసాగుతూ 72వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మైసూరులో వడయార్ రాజా వంశీయులు మాదిరిగానే ఉయ్యూరు రాజా వారు జమ్మి కొట్టి అమ్మవారికి పూజ చేయడం, గౌరవ సూచకంగా తుపాకీ పేల్చి దసరా ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా ప్రారంభిస్తారు. కుల,మత, ప్రాంతం వంటి ఎలాంటి బేధాలు లేకుండా ప్రజానీకం ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రస్తుతం దసరా సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి కృష్ణా నుంచే కాకుండా ఉభయగోదావరి, తెలంగాణా నుంచి కూడా వేలాదిగా తరలివస్తున్నారు.

### ఎటుచూసినా రాజరికపు ఆనవాళ్లే...

గతంలో ఏడు సంస్థానాలకు రాజధానిగా భాసిల్లిన నూజివీడు రాచరికపు కోటలకు నిలయంగా ఉండేది. తమ కోటలను శత్రువుల భారి నుంచి పరిరక్షించుకునేందుకు గుర్రాలు, కుక్కల గేట్లను సైతం నిర్మించారు. నేటికీ ఆ గేట్లు అలాగే ఉన్నాయి. క్రీర్తిశేషులు డాక్టర్ ఎం.ఆర్.అప్పారావు తండ్రి రాజా మేకా వెంకటాద్రి అప్పారావు (ఉయ్యూరు ఎస్టేట్) నాయకత్వంలో దసరా ఉత్సవాలను రంగ రంగ వైభవంగా నిర్వహించటం ప్రారంభించారు. దాదాపు ఐదు దశాబ్ధాలకుపైగా ఆయన నేతృత్వంలో ఈ ఉత్సవాలు జరిగాయి.

### ఏటేటా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ద్వారా అఖిల భారత చెడుగుడు పోటీలు, దసరా ఉత్సవాల సందర్భంగా ఏటేటా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది 73వ వార్షిక అఖిల భారత చెడుగుడు పోటీలు పురుషులు, మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీలు జరగనున్నాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుంది.

## భవిత సెంటర్‌లో ప్రతి మంగళవారమూ ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - ముసునూరు

ఫిజియోథెరపీ అవసరం లేకుండా ఉండాలంటే ప్రతి వ్యక్తి వ్యాయామం చేయాలని, దీంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంగా ఉంటారని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతిరోజు తప్పనిసరిగా ఉదయం పూట వ్యాయామం చేయాలని సూచించారు. మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల పరిధిలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాల పిల్లలకు, విద్యార్థులకు ప్రతి మంగళవారం ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తారని తెలిపారు. ఐఇఆర్‌టియు ఉపాధ్యాయులు డిఎంవి. లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఫిజియోథెరిపీ చేస్తున్న ఫెజియోథెరపిస్టు

## భారతీయతా భావం నుండి వేరు చేయలేం

లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను రాజ్యాంగ పీఠికలో 'చేర్చారు', ఇది 1970ల నాటి ప్రభుత్వ బలవంతపు చేర్పు! అన్న వాదనలు మోసపూరితమైనవి. రాజ్యాంగసభ చర్చలు, వలస పాలన నుండి విముక్తి కోసం సాగిన స్వాతంత్ర్యోద్యమ అనుభవాలు - ఇవన్నీ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన మన దేశం ఎంచుకున్న ఆదర్శాలకు కేంద్ర బిందువులు. రాజ్యాంగం పూచీ పడిన సామాజిక ఆర్థిక న్యాయం, సమానత్వం, సహోదరత్వ భావాలు ప్రస్తుతం సామ్యవాద లక్షణాలే. మత స్వేచ్ఛను కల్పించడం, మత ప్రాతిపదికన వివక్షకు పాల్పడకుండా సాగడం, మైనార్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండడం లౌకికవాద ఆదర్శాలే. పీఠిక నుండి ఈ రెండు పదాలనూ తొలిగించినా మన రాజ్యాంగ మౌలిక సిద్ధాంతం, నిర్మాణం, స్వభావం అన్నీ లౌకికవాద, సామ్యవాద భావజాలానికే కట్టుబడి ఉంటాయి.

1949 నవంబర్ 25న రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ సభను ఉద్దేశించి చేసిన కడపటి ప్రసంగం కూడా ఈ స్ఫూర్తినే వ్యక్తీకరించింది. "మనం సాధించుకున్న రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతప్తి పడకూడదు. మనం సాధించుకున్న ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా మలుచుకోవాలి. సామాజిక ప్రజాస్వామ్యాన్ని పునాదిగా నిలబెట్టుకోలేని ఏ రాజకీయపు ప్రజాస్వామ్యమూ ఎంతో కాలం మనలేదు. ఇంతకీ సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం. ఈ మూడూ జీవిత సూత్రాలుగా కొనసాగాలి. సమానత్వం లేని స్వేచ్ఛ, స్వేచ్ఛ లేని సమానత్వం పొసగే అవకాశం లేదు. స్వేచ్ఛ, సమానత్వాలు రెండూ సహోదరత్వ భావనతో ముడిపడి వుంటాయి. సమానత్వం లేని స్వేచ్ఛ అతి కొద్దిమందిని అధికులుగా తయారు చేస్తుంది. అలాగే సహోదరత్వ భావన కొరవడిన స్వేచ్ఛ అత్యధికుల మీద అతి కొద్దిమంది ఆధిపత్యానికి దారితీస్తుంది. సహోదరత్వ భావన కొరవడిన స్వేచ్ఛ, సమానతలు స్వాభావికంగా మనజాలవు" అని అంబేద్కర్ స్పష్టం చేశారు.

అంతేకాదు - "సామాజిక తలంలో మన భారతీయ సమాజం తీవ్రమైన అంతరాల దొంతరలతో కూడుకుని ఉన్నందున కొందరు అత్యున్నత స్థాయిలో మరికొందరు అత్యంత అథమ స్థాయిలో జీవిస్తున్న పరిస్థితి ఉన్నది. అర్థిక రంగాన్ని పరిశీలిస్తే సమాజంలో అతి కొద్ది మంది పట్టరాని సంపదను అనుభవిస్తుంటే అత్యధిక ప్రజానీకం దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26న మనం ఇన్ని వైరుధ్యాల మయమైన జీవితంలోకి అడుగిడబోతున్నాం. రాజకీయాల్లో సమానత్వం దాగి సామాజిక ఆర్థిక జీవితాల్లో తీవ్ర అసమానతలు ఎదుర్కొంటున్నాం. రాజకీయాల్లో ఒక మనిషికి ఒకే ఓటు ఒకే విలువను మనం గుర్తిస్తున్నాం. అయితే మన సమాజంలో సామాజికంగా ఆర్థికంగా నెలకొన్న తీవ్ర అసమానతల కారణంగా సామాజిక ఆర్థిక జీవితాల్లో ఒక మనిషి ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తున్నాం. సామాజిక ఆర్థిక రంగాల్లో ఇలా మనం ఎంతకాలం సమానత్వాన్ని నిరాకరిస్తూ కొనసాగగలుగుతాం? ఎప్పటికి ఈ వైరుధ్యాన్ని పరిష్కరిస్తాం? ఈ అసమానతలు దీర్ఘ కాలం పాటు కొనసాగితే మన రాజకీయ ప్రజాస్వామ్యం పెను సంక్షోభంలో పడిపోతుంది. సాధ్యమైనంత తొందరగా మనం ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలి. లేదంటే ఈ అసమానతలతో బాధలు అనుభవిస్తున్నవారు మనం ఎంతో శ్రమకోర్చి సాధించుకున్న రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని బద్దలుకొడతారు." అని డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు.

సమాజంలో ఉన్న సామాజిక, ఆర్థిక అంతరాలను, అసమానతలను పరిష్కరించే సాధనంగా మన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని అంబేద్కర్ శక్తివంతంగా తెలియజెప్పారు. లౌకికవాదం, స్వామ్యవాదాల స్ఫూర్తి ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. మన రాజ్యాంగానికి పునాది విలువలుగా ఉన్న లౌకికవాదం, స్వామ్యవాద భావనలను ఏమాత్రం పలుచన చేయాలని చూసినా రాజకీయ ప్రజాస్వామ్యం దెబ్బ తినిపోయే ప్రమాదం ఉన్నదని ముందుగానే హెచ్చరించారు.

### బట్టబయలైన ఆర్.ఎస్.ఎస్ వైఖరి

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబళె మన రాజ్యాంగ పీఠిక నుండి సామ్యవాదం, లౌకికవాదం అన్న పదాలను తొలగించాలని ఆషామాషీగా పిలుపు ఇవ్వలేదు. చారిత్రక తప్పిదాలను సరిచేసే పేరిట మన రాజ్యాంగం పునాది నిర్మాణం మీదనే దాడి చేయడానికి ప్రణాళికాబద్ధంగా వేసిన ఎత్తుగడ ఇది. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ ప్రతిలో ఈ రెండు పదాలూ లేవని కాషాయ శక్తులు వాదనకు దిగుతున్నాయి కానీ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోనే అంతర్గతంగా ఈ భావనలు పొందుపరచబడ్డాయన్న వాస్తవాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. 42వ రాజ్యాంగ సవరణ పరోక్షంగా వున్న భావానికి ప్రత్యక్ష రూపం ఇచ్చింది. 42వ రాజ్యాంగ సవరణ చేపట్టక మునుపే రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(ఎ)లో లౌకికవాదం అనే పదం పొందుపరచబడి ఉంది. అలాగే రాజకీయ, సామాజిక శాంతిని నెలకొల్పడం కోసం ప్రజల సంక్షేమాన్ని పెంపొందించాలని ఆర్టికల్ 38 ద్వారా నిర్దేశించి సామ్యవాద భావనలవైపు మొగ్గింది.

చారిత్రకంగా పరిశీలిస్తే ఆర్ఎస్ఎస్ మన సమాజంలో అసమానతలు, పితృస్వామిక భావజాలాన్ని మరింతగా పెంచి పోషించి, మెజార్టీ మతతత్వ ధోరణితో మన జాతీయతను పునర్ నిర్వచించాలని ప్రయత్నిస్తున్నదని ఎవరికైనా ఇట్టే బోధపడతుంది. చరిత్రను తిరగ రాసి, వలస వ్యతిరేక స్వాతంత్ర్యోద్యమ ఘన వారసత్వానికి మసిబూసి మారేడు కాయ చేసి మత రాజ్యాన్ని స్థాపించాలనే తన లక్ష్యానికి ఆటంకంగా ఉన్నాయి కాబట్టే రాజ్యాంగ పీఠిక నుండి లౌకికవాద, సామ్యవాద పదాలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నది. ఇది మన దేశ బహుళత్వానికి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిది. మన రాజ్యాంగం ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వ భావనలను కల్పించాలని, ఇందుకు లౌకికవాద, సామ్యవాద దృక్పథమే మార్గాంతరమని స్పష్టం చేస్తుంది. ఆర్ఎస్ఎస్ తాజాగా ఈ విలువల మీదే దాడికి తెగబడి ప్రజలకు రాజ్యాంగ హక్కులు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నది. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో మనుస్మృతిని తీసుకువచ్చి దేశాన్ని హిందూ రాజ్యంగా మలచాలని కుట్ర పన్నుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకుని తమ యవ్వనాన్ని వ్యర్థం చేసుకోవద్దని పిలుపునిచ్చి ఒక తరం యువతరాన్ని బ్రిటిష్ వలస వ్యతిరేక పోరాటానికి దూరం చేయాలన్న దుష్ట బుద్ధితో వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ తాజా కుట్రలను...స్వాతంత్ర్యోద్యమ విలువల పట్ల గౌరవంగల శక్తులన్నీ కలిసి ఐక్యంగా తిప్పికొట్టాలి. మతతత్వ హిందూ రాజ్యాన్ని నెలకొల్పాలన్న ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలను వమ్ము చేసి భారత రాజ్యాంగాన్ని సమున్నతంగా నిలబెట్టాలి.

# నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

## ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మండలంలోని 16 గ్రామాల ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

**ప్రశ్న : ముసునూరు మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?**

**ఎంఇఒ :** మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల ఉన్నాయి. మొత్తం 3,226 మంది విద్యార్థులు, 212 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

**ప్రశ్న : మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫామ్‌లు అందాయా?**

**ఎంఇఒ :** 95 శాతం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫామ్ అందించాం.

**ప్రశ్న : గత ప్రభుత్వంలో నాడు-నేడు పనుల్లో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తియ్యాయ్యా?**

**ఎంఇఒ :** నాడు-నేడు పనులు ఒకటి, రెండు పాఠశాలల్లో తరగతి గదులు తప్ప మిగిలినవన్నీ పూర్తయ్యాయి.

**ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటిల్ తరగతులు ఎలా నడుస్తున్నాయి. ఇంగ్లీషు మీడియం ఏ విధంగా బోధిస్తున్నారు?**

**ఎంఇఒ :** ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువుకు ఎక్కువ మంది విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. డిజిటిల్ క్లాసులు కుడా నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న : మండలంలో ప్రయివేట్ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?**

**ఎంఇఒ :** ఏడు ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి.

**ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలలు ఏమైనా మూసివేశారా?**

**ఎంఇఒ :** మండలంలో ఈ ఏడాది ఏ పాఠశాల మూసివేయలేదు.

**ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏ విధమైన కృషి చేస్తున్నారు?**

**ఎంఇఒ :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నాం.

# ప్రజా సంక్షేమానికి సేవా గుణంతో పనిచేస్తా

## గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి - తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజాసంక్షేమానికి సేవా గుణంతో పనిచేస్తానని, గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి (ముసునూరు గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి తనయుడు) అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్యక్షతన మండల కేంద్రమైన ముసునూరులో తాగునీటి సరఫరాకు నూతన బోర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీధిలైట్లు ,పారిశుధ్యం, డ్రెయినేజీ వంటి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. సిల్క్ నగర్‌లో ఎంపిటిసి నిధులతో పక్కా డ్రెయినేజీ నిర్మించడంతో పాటు గ్రామ కంఠంలో అన్ని తరగతుల వారు నడిచే ప్రదేశంలో రూ.లక్షలు ఖర్చుపెట్టి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రైతుల పంట పొలాల్లో నీటి గుంతలు తవ్వినట్లు తెలిపారు. బిసి, ఎస్‌సి ఏరియాలో పశు పక్షాధిలకు నీటి తొట్టెలు నిర్మించామని, గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న పురాతన నేల బావులను గుర్తించి పూడ్చివేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వర్షకాలంలో సిల్క్‌నగర్‌లో రోడ్డు మరింత అధ్వానంగా ఉండి నడిచే పరిస్థితి కూడా లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను జిల్లా ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషేను కలిసి రెండు కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. పూడిక తీత పనులు చేయించామని, ఎస్‌సి ఏరియాలో నూతనంగా నిర్మించిన ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పించామని తెలిపారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో నిరహార దీక్షలో పాల్గొన్నామని, జగన్ ఎంపిపి పాఠశాలలను విలీనం చేస్తూ జిఒ ఇచ్చిన సమయంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అండగా నిలిచి ఆందోళన చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 75 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.

**భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు**

**కొండేటి విజయలక్ష్మి, ముసునూరు గ్రామ సర్పంచి**

గ్రామానికి ఉపయోగపడే ఏ పని మొదలుపెట్టినా ఆ పనిని సకాలంలో పూర్తి చేసేందుకు తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి కృషి చేస్తారు. సర్పంచిగా గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాం. అలాగే భవిష్యత్తులో కూడా గ్రామంలో అభివృద్ధి పనులు చేయడంతో పాటు, మండలాభివృద్ధికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం.

# కష్టపడితేనే విజయం సొంతం

## చెక్కపల్లి చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ నాగరాజు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే విజయం సొంతమవుతుందని చెక్కపల్లి చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్, మేనేజింగ్ డైరెక్టర్ మరీదు నాగరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని చెక్కపల్లి చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి తరగతి గదిలో అతి తక్కువ విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం నిర్వహించే ప్రతి పరీక్షలోను తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. వివిధ ప్రాజెక్టుల్లో 14కు పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు విజయం సాధించారన్నారు. ప్రత్యేక బహుమతులు సాధించారని వివరించారు. ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధిస్తున్నారని తెలిపారు.

విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ప్రిన్సిపల్ నాగరాజు



# పల్లె ప్రతిభకు పట్టం... ట్రిపుల్ ఐటీ

- 2008లో కీర్తిశేషులు వైఎస్ఆర్‌చే ప్రారంభం
- ఆర్‌జియుకెటి పరిధిలో నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటీలు

నూజివీడు ట్రిపుల్ ఐటీ ముఖద్వారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పల్లె ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సైతం అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో 2008లో ఆనాటి ముఖ్యమంత్రి కీర్తిశేషులు డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలో ట్రిపుల్ ఐటీలు కొనసాగేలా ఏర్పాటు చేశారు. పల్లె ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివిన వారికి ట్రిపుల్ ఐటీల్లో అగ్ర తాంబూలం ఇచ్చారు. 2008 మార్చిలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ చట్ట ప్రకారం గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు టెక్నాలజీలో కోర్సులను చదువుకోవడానికి ఏర్పాటైంది. ఆ తరువాత 2008లోనే ప్రభుత్వం శాసనసభ చట్టం ద్వారా దీనిని పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా రూపొందించింది. 2008 ఆగస్టులో పదో తరగతి పాసైన సుమారు ఆరు వేల మందితో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ మొదటి బ్యాచ్ ప్రారంభమైంది.

పదో తరగతి పాసైన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ ఆరేళ్ల బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ విద్యను అందిస్తోంది. ఇందులో ఇంటర్‌కు సమానమైన రెండేళ్ల ప్రీ-యూనివర్సిటీ కోర్సు తోపాటు ఇంజినీరింగ్ కోర్సులో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఉంటుంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ కోర్సులు కూడా ఉంటాయి.

ప్రభుత్వం నిర్ణయించిన అన్ని రిజర్వేషన్లను అనుసరించి విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారు. డాక్టర్ వైఎస్ఆర్ జీవించి ఉన్న కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉండడంతో తెలంగాణ రాష్ట్రంలోని బాసరలో కూడా ట్రిపుల్ ఐటీ కళాశాలను కొనసాగించారు. వైఎస్ఆర్ మృతి అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా చీలిపోయింది. ప్రస్తుతం ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీ కళాశాలలు కొనసాగుతున్నాయి. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయలోని ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా అత్యాధునికమైన కోర్సులను అందిస్తున్నారు.

**అందుబాటులో ఉన్న కోర్సులు..**

**కెమికల్ ఇంజినీరింగ్**
**సివిల్ ఇంజినీరింగ్**
**కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్**
**ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్**
**ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్**
**మెకానికల్ ఇంజినీరింగ్**
**మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్**
**బిజినెస్ మేనేజ్ మెంట్**
**గణితం**
**భౌతిక శాస్త్రం**
**రసాయన శాస్త్రం**
**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ**

కళలు, గాత్ర సంగీతం, కూచిపూడి నృత్యం, యోగా వంటి అనేక అదనపు విద్యా కార్యకలాపాలను నిర్వహిస్తుంది. పాఠ్య ప్రణాళికలో భారతదేశంలోని శాస్త్రీయ కళా రూపాలను కూడా చేర్చారు. ఏటా జాతీయ స్థాయి టెక్నో-కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు.

విద్యాసంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు యూనిఫామ్స్, మెస్ కాంట్రాక్ట్ రద్దు, ల్యాప్‌టాప్‌లు, ఛాన్సలర్‌ల భర్తీ వంటి డిమాండ్లతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సహేతుకమైన హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. ట్రిపుల్ ఐటీలో టీ హబ్ సెంటర్ ఏర్పాటుతోపాటు, మినీ స్టేడియం, అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, డిజిటల్ ఇన్నోవేషన్ ల్యాబ్, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించడం, మోడర్న్ క్లాస్ రూముల వంటివి ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2022లో జరిగిన స్నాతకోత్సవంలో 570 మంది విద్యార్థులకు ఇంజినీరింగ్ పట్టాలు, గత మూడేళ్లలో ఆయా విభాగాల్లో వర్సిటీ టాపర్లుగా నిలిచిన 36 మంది విద్యార్థులకు స్వర్ణపతకాలు, 2200 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, 1500 డెస్క్ టాప్ కంప్యూటర్లను అందించారు.

**నూజివీడులోనే శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలు కొనసాగింపు**

ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో నూజివీడు క్యాంపస్‌తో పాటుగా శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లు కూడా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటీ కళాశాలల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పన నేపథ్యంలో అన్ని విధాలా సౌకర్యాలు కలిగి ఉన్న నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ రెండు క్యాంపస్‌లను అదనంగా కొనసాగించాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నూజివీడు విద్యార్థులతో పాటు శ్రీకాకుళం, ఒంగోలు విద్యార్థులు కూడా విద్యను అభ్యసిస్తున్నారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..**

**ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్**

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మూడు క్యాంపస్ల విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. బాలురు తక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు అంతస్తులను బాలికల కోసం ప్రత్యేకంగా తయారు చేసి హాస్టల్ వసతి కల్పించినట్లు ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

**అక్షయపాత్రకు అవకాశం..**

మెస్‌లలో అప్పుడప్పుడు ఏర్పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గమనించి వాటి స్థానంలో అక్షయపాత్ర నిర్వాహకులకు మెస్‌లను అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వాసనీయ సమాచారం. అతి త్వరలోనే అక్షయపాత్ర నిర్వాహకులు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మెస్‌లలో భోజనం, ఆహారం అందిస్తారని సమాచారం.